# ఎపి హజ్ బులెటిన్

తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రచురితం

సంపుటి 2 సంచిక 3

మార్చి - 2018

రజబ్, హిజ్రీ 1439



**చీఫ్ ఎడిటర్**

**మహమ్మద్ లియాఖత్ అలీ**

**ఎడిటర్**

**డా.ఫజులుల్లా ఖాన్**

**ఎడిటోరియల్ బోర్డు**

ముఫ్తి ముహమ్మద్ ఫారూక్ అల్ ఖాసిమీ

మౌలానా ముహమ్మద్ ఇల్యాస్

ముఫ్తి కె.ముహమ్మద్ రఫీ

**హజ్ కమిటీ సభ్యులు**

మోమిన్ అహ్మద్ హుస్సేన్ ఛైర్మన్

ముహమ్మద్ అహ్మద్ షరీఫ్ కౌన్సిల్ విప్

షేక్ మస్తాన్ షరీఫ్ జడ్పీటీసీ

టి.మహబూబ్‌సాబ్ ఎంపీపీ

షేక్ అక్బర్ సాహెబ్, వైఎస్.ఎంపిపీ

అబ్దుల్ చినరెహ్మాన్

హాజీ షేక్ హసన్ బాషా

సయ్యద్ షా మఖ్దూమ్ బుఖారి



సంవత్సర చందా 85/-

విడిప్రతి వెల: **15/-**

ప్రచురణ

**ఎపి స్టేట్ హజ్ కమిటీ**

మసీదు వీధి, లబ్బీపేట్, విజయవాడ

టోల్‌ఫ్రీ నెం: 18004257873


బిస్మిల్లాహ్ హిర్రహ్మా నిర్రహీమ్

**అమిత దయాళువు, అనంత కరుణామయుడు అయిన అల్లాహ్ పేరుతో...**

## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 2 |
| పురుషుల పరదా | 3 |
| 'జమ్‌జమ్' మహత్యం | 4 |
| తెలుసుకోవాల్సిన అరబీ పదాలు | 7 |
| హజ్రె అస్వద్ | 8 |
| నమాజు ఎందుకంటే.. | 11 |
| ఇతరుల ఇంట్లోకి తొంగి చూడడం నిషిద్ధం | 12 |
| హజ్ మూడవ రోజు | 13 |
| హజ్‌లో తప్పనిసరి విధులు | 15 |
| హజ్ ఎప్పుడు ఆరంభమైనది? | 16 |
| పవిత్ర ఖురాన్ సూచనలు | 22 |
| పరమ ప్రభువు అల్లాహ్ ఒక్కడే ! | 27 |
| అక్రమ సంపాదన | 29 |
| ఖుర్‌ఆన్ ఉపదేశం సూరతున్నస్ర్ | 30 |
| హజ్‌యాత్ర-సందేహాలు-సమాధానాలు | 32 |
| ఎన్.టి.ఆర్. విద్యోన్నతి | 34 |



## ఎ.పి.హజ్‌బులెటిన్ చదవాలనుకుంటున్నారా?

వెంటనే చందాదారులుగా చేరండి. హజ్-ఉమ్రా విధివిధానాలను ఖురాన్ హదీస్‌ల ఆధారంగా ఇస్లామిక్ స్కాలర్స్ ఆధ్వర్యంలో "ఎ.పి.హజ్‌బులెటిన్"ను ఎపి హజ్ కమిటీ ప్రచురిస్తోంది. చందా వివరాలు విడి ప్రతి రూ.15/- సంవత్సర చందా రూ.85/- **(డ్రా తేదీ నుంచి హజ్‌యాత్రకు వెళ్ళే వరకు)**

చందా మొత్తాన్ని ఎపి స్టేట్ హజ్ కమిటీ, **అకౌంట్ నెంబర్: 034310100141377 ఐఎఫ్ఎస్‌సి కోడ్: ఎఎన్‌డిబి0000343 ఆంధ్రబ్యాంక్ లబ్బీపేట్ బ్రాంచ్, విజయవాడలో** జమాచేయాలి.

## ఇస్లామిక్ స్కాలర్స్ నుంచి వ్యాసాల్ని ఆహ్వానిస్తున్నాం

ప్రతి నెల విడుదలౌతున్న హజ్‌బులెటిన్‌లో ప్రచురించడానికి ఇస్లామిక్ స్కాలర్స్ నుంచి హజ్, ఖురాన్, హదీస్‌కు సంబంధించిన ఆర్టికల్స్ (తెలుగు-ఉర్దూ భాషలో డిటిపి చేయించి ఓపెన్ ఫైల్ aphajjpro@gmail.comకు మెయిల్ చేయాలి). ప్రింట్ అవుట్ కానీ, రాత ప్రతిని కాని పంపరాదు.



**RNI No: TELBIL/2017/73690**

Edited, Printed & Published by **MD Liyakat Ali**, E.O. AP Haj Committee, 3rdFloor, # 39-3-2, Mosque Street, Labbipet, ViJayawada, AP. Printed at AP Haj Committee Vijayawada. Editor: Dr.Fazalullah Khan

**EMail:aphajcommittee@gmail.com,Website:apstatehajcommittee.com**

అస్సలాము అలైకుమ్ వ రహ్మాతుల్లాహి వ బర్కాతహు వ మగిరతహూ.....

# సంపాదకీయం

**ఫీహి ఆయాతిమ్ బయ్యినాతిమ్ మఖాము ఇబ్రాహీమ్ వమన్ దఖలహూ కాన ఆమినా వలిల్లాహి అలన్నాసి హిజ్జుల్‌బైతి మనిస్ తతాఅ ఇలైహి సబీలా వమన్ కఫర ఫయిన్నల్లాహ గని య్యున్ అనిల్ ఆలమీన్. (3వ సూరహ్ ఆల్ ఇమ్రాన్, ఆయత్ నంబర్ 97, పార నంబర్ 4)**

నిశ్చయంగా మానవజాతి కొరకు మొట్ట మొదటి ఆరాధనా గృహం మక్కాలో ఉన్నదే, శుభాలతో నిండినది, సమస్తలోకాల ప్రజలకు మార్గదర్శకత్వాన్ని ప్రసాదించేది. ఇది జెరూసలంలోని సులైమాన్(అ.స) నిర్మించిన బైతుల్ మఖ్దిస్ కంటే ఎంతో ప్రాచీనమైన ఆరాధనా గృహం. ఇది మానవ జాతి కొరకు నిర్మించబడిన మొట్ట మొదటి ఆరాధనాలయం. దానిలో ప్రవేశించినవారు రక్షణ పొందుతారు. ఎవరైతే ఆరోగ్య వంతులై ఉండి హజ్జ్ చేయటానికి కావలసిన ఖర్చులు భరించగలిగి వుండి, శాంతియుతంగా ఎలాంటి ధన, ప్రాణ హాని లేకుండా హజ్జ్‌కు పోగలరో, వారి కొరకు వారి జీవితంలో ఒక్కసారి హజ్జ్ యాత్రకు పోవటం విధిగా చేయబడింది.

హజ్రత్ అబూ హురైరా(ర) ఉల్లేఖనం: 'అన్నిటికంటే ఉత్తమమైన కార్యం ఏది? అని ఒక సహాబీ ముహమ్మద్ ప్రవక్తను(స)ను అడిగారు. 'దైవాన్ని, దైవప్రవక్తను విశ్వసించడం' అని బదులిచ్చారు ప్రవక్త(స). దాని తరువాత అని ఆ సహాబీ మళ్ళీ ప్రశ్నించగా 'దైవసమ్మతమైన ధర్మం కొరకు పాటుపడడం' అని సమాధానమిచ్చారు. దాని తరువాత అని మళ్ళీ ప్రశ్నిస్తే 'మనిషి దైవాజ్ఞల్ని ఉల్లంఘించకుండా పూర్తి చేసే హజ్' అని సమాధానం ఇచ్చారు దైవప్రవక్త(స). ముహ్మద్ ప్రవక్త(స) ఇలా ఉపదేశించారు: 'ఎవరైతే హజ్‌యాత్ర సంకల్పం చేసుకుంటారో వారు జాప్యం చేయకుండా తొందరపడాలి. ఎందుకంటే వారు వ్యాధిగ్రస్తులు కావచ్చు లేదా హజ్ ప్రయాణం సాధ్యపడకుండా ఏదైనా అవసరం వచ్చిపడవచ్చు. (ఇబ్ను మాజా-ఇబ్ను అబ్బాస్)

హసన్(ర) ఇలా ఉల్లేఖించారు: ఈ నగరాల్లో గూఢచారుల్ని పంపి హజ్ చేయగల శక్తి ఉన్నప్పటికీ హజ్ చేయని వారి వివరాలు సేకరించాలనీ, అలాంటి వారిపైన 'జిజ్‌యా' విధించాలనీ నా సంకల్పం. అలాంటి వారు ముస్లింలు కారు. ముమ్మాటికీ కారు. (ముస్లిం అయితే అప్పుడే హజ్ చేసి ఉండేవారు. ముస్లిం అంటేనే స్వయాన అల్లాహ్‌కు సమర్పించుకునే వాడని అర్థం. వాస్తవంగా మనిషి తన్ను తాను అల్లాహ్‌కు సమర్పించుకుంటే ఏ కారణం లేకుండా హజ్ లాంటి మహత్తర ఆరాధనను ఉపేక్షిస్తాడా?) అని హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(ర) చెప్పేవారు.

హజ్ సందర్భంగా కాబా నుంచి బయలుదేరి, మీనాలో క్యాంప్ వేయడం అక్కడి నుంచి మరో చోటికి కదలడంలోని అభ్యాసాలను మీరు నమాజ్, రోజా, జకాత్‌లతో కలిపి చూడండి. ముస్లింలతో చేయించదలచిన ఓ మహత్కార్యానికి ట్రైనింగ్ అని తెలుస్తుంది. అందుకే కాబా గృహం వరకు వెళ్ళి రాగలిగే స్థోమతవున్న ముస్లింలలో సాధ్యమైనంత ఎక్కువ మంది ముస్లింలు ఈ ట్రైనింగ్ పొందాలన్నదే ఇస్లామ్ ఉద్దేశ్యం. హజ్ సంకల్పంతో హజ్ చేయడానికి బయలుదేరడం మొదలుకొని, తిరిగి ఇంటికి చేరే వ్యవధిలో హృదయంపై ఎలాంటి ప్రభావాలు పడతాయో మీరే ఊహించండి. అందులో సమయ త్యాగం, ధన త్యాగం, తన సౌలభ్యాల త్యాగం, ఇంకా అనేక త్యాగాలున్నాయి. ఇదే విధంగా ప్రాపంచిక సంబంధాల త్యాగమూ ఉంది. అనేక మానసిక కోరికల త్యాగమూ ఉంది. ఇదంతా కేవలం అల్లాహ్ కోసమే కదా. ఇందులో మరే స్వార్థం కనిపించదు. హజ్ యాత్రలో దైవభీతితో పాటు ఎడతెగని దైవనామస్మరణ, దైవం పట్ల శ్రద్ధాభక్తులు, ప్రేమ జనిస్తాయి. ఇవి మనిషి హృదయంపై శాశ్వతమైన ముద్ర వేస్తాయి. ఈ ముద్ర అతని మనసులో సంవత్సరాల తరబడి నిలిచి వుంటుంది. 'హరం'(కాబాగృహం) భూభాగంపై కాలు మోపిన వాడు అల్లాహ్ ధ్యానంలో, ఆయన ఆరాధనలో తన సర్వస్వాన్ని త్యజించి అల్లాహ్ నామాన్ని ఆయన కీర్తిప్రతిష్టలను నలువైపులా చాటుతాడు. కాబా గృహ ప్రదక్షిణ ద్వారా ఆధ్యాత్మిక ఆనందం పొందుతాడు.

**- మహమ్మద్ లియాఖత్ అలీ**
చీఫ్ ఎడిటర్

# పురుషుల పరదా

ఖుర్ఆన్‌లో అల్లాహ్ సెలవిస్తున్నాడు: (ఓ ప్రవక్తా!) ముస్లిం పురుషులు తమ చూపులను క్రిందికి ఉంచాలనీ, వారు తమ మర్మస్థానాలను కాపాడుకోవాలనీ, అది వారి కొరకు పవిత్రమైనదని వారితో చెప్పు. వారు చేసేదంతా అల్లాహ్ కు తెలుసు. ఖుర్ఆన్ సూరా నూర్ 24:30

ఇస్లాంలో గైర్ మహ్రం(పెళ్లి చేసుకొనే అవకాశం గలవారు)తో కరచాలనం చేసే అనుమతి లేదు. దీని గురించి దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం ఇలా అన్నారు: "మీకు అనుమతించబడని (గైర్ మహ్రం) స్త్రీలను ముట్టుకోవడం కన్నా మీ తలను ఇనుప సూదితో గుచ్చడం మీకు మేలైనది." (అల్ ముజాం అల్ కబీర్‌లో అత్ తబరాని (20/213), అల్ ముసన్నఫ్ లో అబీ శైబహ్ (4/341). పురుషుల పరదా నిబంధనలు

1. కనీసం నాభి నుండి కాలి మడమకు దిగకుండా ఉండాలి.

2. ఇది శరీరానికి చాలా బిగువుగా లేదా శరీరం కనిపించేలా ఉండకూడదు.

3. అది ఎంత వదులుగా ఉండాలంటే శరీరపు ఏ భాగమూ కనిపించకూడదు.

4. అది మగవారి వస్త్రంలా ఉండాలి, ఆడవారి వస్త్రంలా ఉండకూడదు.

5. దాని మీద ఎలాంటి డిజైన్లు ఉండకూడదు, ఎందుకంటే వాటి వల్ల ఆడవారికి ఆకర్షణ పుడుతుంది.

6. అది గర్వానికి, అహంకారానికి ప్రతీక కాకూడదు.

7. అది అవిశ్వాసులను పోలి ఉండరాదు. అవిశ్వాసుల ధర్మానికి ప్రతిబింబించే ఎలాంటి గుర్తులు ఉండకూడదు.

ఖుర్ఆన్‌లో పరదా పురుషులు మరియు స్త్రీలకు అనివార్యం చేయబడింది. ఖుర్ఆన్ మరియు హదీసులలో సూచించిన విధంగా కేవలం ఒక్క అల్లాహ్‌నే ప్రార్థించడం తన కర్తవ్యం మరియు అల్లాహ్ యే తాను సృష్టించబడటానికి కారణం అని ప్రతి ముస్లిం భావిస్తాడు. పరదా కూడా అల్లాహ్ కు విధేయత చూపే ఓ మార్గం.

"అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఏ వ్యవహారంలోనైనా ఒక నిర్ణయం చేసిన తరువాత విశ్వాసులైన ఏ పురుషునికిగానీ, స్త్రీకి గానీ తమకు వర్తించే ఆ వ్యవహారంలో ఎలాంటి స్వయం నిర్ణయాధికారం మిగిలి ఉండదు. ఒకవేళ ఎవరైనా అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపితే అతను స్పష్టమైన అపమార్గానికి లోనైనట్లే (జాగ్రత్త). ఖుర్ఆన్ సూరా అహ్‌జాబ్ 33:36

# 'జమ్‌జమ్' మహత్యం

'జమ్‌జమ్' అనేది సౌదీ అరేబియాలోని మక్కాలో ఒక బావి పేరు. లక్షలాది మంది దాహార్తిని అది తీరుస్తుంది. ముఖ్యంగా హజ్ పవిత్ర యాత్ర సమయంలో దేశ, విదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది యాత్రికుల దాహాన్ని తీరుస్తుంది. జమ్‌జమ్ నీరు ప్రాముఖ్యత ప్రవక్తలయిన ఇబ్రాహీమ్(అ), ఇస్మాయీల్(అ), ముహమ్మద్(స), ఇస్మాయీల్(అ) తల్లి హాజిర(అ)లతో ముడిపడి వుంది.

ఇస్లామీయ సంప్రదాయం ప్రకారం ప్రవక్త ఆదమ్(అ) నిర్మించిన దైవగృహాన్ని (బైతుల్ అల్లాహ్) ప్రవక్త ఇబ్రాహీమ్(అ) పునర్నిర్మించారు. దానిని 'కాబా' అని పిలువడం జరుగుతోంది. ప్రపంచంలోని ముస్లింలందరూ రోజుకు ఐదుసార్లు ఈ కాబా (ఖిబ్లా) దిశలోనే నమాజును చేస్తారు. కాబాకు తూర్పున 20 మీటర్ల దూరంలోనే జమ్‌జమ్ నీటి బావి ఉంది. ఈ బావి 35 మీటర్ల లోతుగా ఉంటుంది. జమ్‌జమ్ నీటికున్న మహత్యం నేటికి అలాగే ఉంది. సుబ్‌హానల్లా!

ఇతర నీటికి, జమ్‌జమ్ నీటికి మధ్య తేడా వుంది. ముఖ్యంగా కాల్షియం, మెగ్నీషియం జమ్‌జమ్ నీటిలో కాస్త అధికం గనుకనే బాగా అలసిపోయిన హాజీలు సయితం, ఈ జమ్‌జమ్ నీరు తాగి, సేదదీరి ఉత్తేజితులవుతుంటారు. జమ్‌జమ్ నీటికున్న మరో ప్రత్యేక ఏమిటంటే దాంట్లో ఉన్న 'ఫ్లోరైడ్స్'కు క్రిమినాశక గుణం కూడా ఉంది.

'జమ్‌జమ్ బావి ఆవిర్భవించిన నాటి నుంచి నేటివరకు ఎన్నడూ ఎండిపోలేదు. ఎంత మంది దాహార్తినైనా తీర్చగల సామర్థ్యం ఈ బావికి వుంది. ఎన్ని ఏళ్ళు గడిచినా కూడా జమ్‌జమ్ నీటిలోని లవణాలు, ఖనిజాల మిశ్రమం ఏమాత్రమూ మార్పు చెందక అవే పాళ్ళలో ఉన్నాయి. కాబాను సందర్శించే ప్రపంచ వ్యాప్త హజ్ యాత్రికులు తిరిగి వెళ్ళేప్పుడు జమ్‌జమ్ నీటిని తమతో తీసుకెళు తుంటారు. వారెన్నడూ నీటిలో తేడా గమనించామని ఫిర్యాదు చేయలేదు. అంటే జమ్‌జమ్ నీరు సర్వకాలాల్లో, సర్వావస్థల్లో తన గుణాన్ని కోల్పోలేదని అర్థం. పైగా జమ్ జమ్ నీటిని రసాయనికంగా శుద్ధి చేయడం, క్లోరిన్ కలపడంగాని జరగలేదు. చాలా బావులలో పాచు, నాచు ఏర్పడడం, సూక్ష్మజీవులు, వాసన చోటుచేసుకోవడం జరుగుతుంటుంది. కానీ జమ్‌జమ్ బావిలో ఇతర బావులకుండే అవలక్షణాలు ఏవీ లేవు. జమ్ జమ్ బావి, దాని నీరు చాలా ప్రత్యేకమైనవి.

## జమ్‌జమ్ ఎలా ఆవిర్భవించింది?

క్రీ.పూ. 2000 సంవత్సరాల క్రితం ప్రవక్త ఇబ్రాహీమ్(అ)గారి సతీమణి హాజిర(అ), ఆమె బిడ్డ ప్రవక్త ఇస్మాయీల్(అ) దప్పిక తీర్చడానికి అల్లాహ్‌యే జమ్‌జమ్ బావిని సృష్టించాడని అందరూ నమ్ముతున్నారు. తీక్షణ మైన ఎండలో దప్పికతో గొంతెండుకపోయి తన బిడ్డ మరణించే దశలో ఉండగా హాజిర(అ) సఫా, మర్వా కొండల మధ్య త్రాగు నీరు కోసం ఏడుసార్లు అటూ ఇటూ పరుగులు పెట్టింది. అదే సంప్రదాయాన్ని నేడు ముస్లింలందరూ తమ హజ్‌యాత్రలో పాటిస్తున్నారు.

ప్రవక్త ఇబ్రాహీమ్(అ) అల్లాహ్ ఆదేశం ప్రకారం తన కుటుంబాన్ని అక్కడ బస చేయించారు. హాజిర(అ) ఆ ప్రాంతంలో నీరుందేమోనని వెతుక్కుంటూ వెళ్ళింది. పదేపదే బిడ్డను చూసుకుంటూ, బిడ్డను వదిలి నీళ్ళను వెదుకుతూ ఆమె పడిన తపనను అల్లాహ్ చూశాడు. చివరికి బిడ్డగా ఉన్న ప్రవక్త ఇస్మాయీల్ పాదాల కింద నీటి ఊటను అల్లాహ్ ప్రసాదించాడు.

## ప్రవక్త ముహమ్మద్(స)కు పూర్వం జమ్‌జమ్

జమ్‌జమ్ ఆవిర్భవించాక మక్కా లోయలోని ప్రజలు అక్కడ స్థిరపడ్డం మొదలెట్టారు. ప్రవక్త ఇస్మాయీల్(అ) సంతతి ఆ ప్రాంతంలో అప్పటికే నివసించారు.

కాలం గడుస్తున్నకొద్దీ ఇస్మాయీల్(అ) ఏకైక దైవ సందేశం వెనక్కి తగ్గిపోయి బహు దైవారాధకులకు చోటిచ్చింది. దాంతో నానా రకాల విశ్వాసాలు ప్రబలి పోయాయి. అయినప్పటికీ జమ్‌జమ్ బావి ప్రాముఖ్యత తరాలు మారినా తగ్గలేదు. ప్రవక్త ముహమ్మద్(స) తాత అబ్దుల్ ముత్తలిబ్ గారికి జమ్‌జమ్ బావి, మక్కాకు వచ్చే హజ్ యాత్రికుల బాధ్యత అప్పగించబడింది.

## శక్తినిచ్చే పానీయం

జమ్‌జమ్ నీటికుండే మహత్తు ఏమిటంటే అది దాహాన్ని మాత్రమేకాక ఆకలిని కూడా సంతృప్తపరుస్తుంది. ప్రవక్త(స) గారి సహచరులలో ఒకరు (సహాబీ) జమ్‌జమ్ నీటిని పూర్వం 'షబ్బాహ్' లేక 'సంతృప్తికారిని' అని పిలిచేవారని తెలిపారు.

ప్రవక్త ముహమ్మద్(స) "ఈ భువిపై వెలిసిన అత్యుత్తమ నీరు జమ్‌జమ్. దానికి దాహాన్ని, ఆకలిని తీర్చే శక్తే కాకుండా వ్యాధులను నయం గుణం కూడా ఉంది." అన్నారు.

హదీస్ ప్రకారం సహాబి అబూ ధర్ అల్- ఘిఫరి ఇస్లాం తొలినాళ్ళలో తొలిసారిగా మక్కాకు వచ్చినప్పుడు నెలరోజులపాటు తన దాహాన్ని, ఆకలిని జమ్‌జమ్ నీటి ద్వారానే తీర్చుకున్నారు.

## వ్యాధి నివారిణి

జమ్‌జమ్ నీటికి వ్యాధి నివారణ గుణం ఉందని ప్రవక్త(స) చెప్పినందున నేటికీ మక్కా వెళ్ళి హజ్ పవిత్ర యాత్రను పూర్తి చేసుకుని వచ్చే యాత్రికులు స్వదేశంలోని తమ బంధువులు, మిత్రుల కోసం జమ్‌జమ్ నీటిని తీసుకొస్తుంటారు.

ప్రవక్త ముహమ్మద్(స) పెద్ద జగ్‌లో లేక తోలు సంచిలో జమ్‌జమ్ నీటిని మక్కా నుంచి మదీనాకు తీసుకువెళ్ళే వారు. దారిలో ఆయన వ్యాధిగ్రస్తులపై ఆ నీటిని చల్లి, ఆ నీటిని త్రాగించేవారు.

ముస్లింలలో రెండవ తరానికి చెందిన వాహబ్ ఇబ్నె మునబ్బాహ్ 'దైవం మీద ప్రమాణం చేసి చెబుతున్నాను, జమ్‌జమ్ నీరు త్రాగిన వారికి అన్ని రకాల వ్యాధులు నయమవుతాయి. పైగా ఆ నీరు త్రాగిన వారికి మంచి ఆరోగ్యం సమకూరుతుంది" అన్నారు.

## జమ్‌జమ్ నీరు-హజ్ యాత్రికులు

హజ్, ఉమ్రా చేసేవారు తమ యాత్రలో జమ్ జమ్ నీటి ద్వారా దప్పికను తీర్చుకోవాలని సిఫార్సు చేయబడింది. పైగా వారు స్వదేశానికి తిరిగి వెళ్ళేప్పుడు కుటుంబ సభ్యులు, మిత్రుల కోసం జమ్‌జమ్ నీరును వెంట తీసుకెళతారు. అమెరికాలో విదేశాల పండ్లు, పానీయాలను దిగుమతి చేసుకోవడం నిషిద్ధం. కానీ మక్కా నుంచి తిరిగి వచ్చే పవిత్ర యాత్రికులు తమ ప్రియతముల కోసం జమ్‌జమ్ నీటిని తీసుకురావడానికి మినహాయింపును ఇచ్చారు.

### జపనీ శాస్త్రజ్ఞుడి పరిశోధన ఫలితం

జపనీ శాస్త్రజ్ఞుడు మసరు ఎమెటో జమ్‌జమ్ నీటిపై నానో టెక్నాలజీ ద్వారా పరిశోధన జరిపాడు. 1000 చుక్కల సాధారణ నీటిలో ఒక చుక్క జమ్‌జమ్ నీటిని కలిపినా ఆ సాధారణ నీరు సైతం జమ్‌జమ్ నీటి లక్షణాలే పుణికిపుచ్చుకుంటుందని తెలిపారు. ఈ భూమిపై ఏ నీటిలో కన్పించని ప్రత్యేకత జమ్‌జమ్‌కు ఉందని తెలిపాడు. ఒక చుక్క జమ్‌జమ్ నీటిలో ఉండే ఖనిజానికి దానికుండే ప్రత్యేకత దానికుంటుందనీ, అదే ఇతర సాధారణ నీటిలో ఇది ఉండదని తెలిపాడు. కొన్ని పరీక్షల్లో జమ్‌జమ్ నీటిలోని మిశ్రమాల నాణ్యత మారదని, జమ్‌జమ్ నీటిని రీసైకిల్ చేసినా ఎలాంటి మార్పు లేని శుద్ధత దానిలో గమనించానని తెలిపాడు.

## మనిషి శరీరంలో...

మనిషి శరీరంలో 72% నీరే! మనం చెడు మాటలు పలికితే దాని ప్రభావం ఉంటుంది. ఉదాహరణకి 'నేను అపజయుడ్ని', 'నేను పనికిరాని వాడిని', 'నాకిక నయం కాదు' ఇలాంటి మాటలు వల్లిస్తే దాని ప్రభావం తప్పక శరీరంపై చెడుగానే ఉంటుంది. అదే 'నేనో అద్భుతం', 'నేను అందగాణ్ణి' వంటి మంచి మాటలు చెబితే అప్పుడు శరీరంపై మంచి ప్రభావమే ఉంటుంది. ఎవరయినా ఖుర్‌ఆన్ పఠించి మామూలు నీళ్ళు ఇచ్చినా,

అది వివిధ రుగ్మతలని నయం చేస్తుందని జపనీ శాస్త్రజ్ఞుడు మసరు ఎమెటో తెలిపాడు.

## జమ్‌జమ్ నీటిపై పరిశోధన

ఈజిప్టుకు చెందిన డాక్టరొకరు 1971లో యూరొపియన్ ప్రెస్‌లో జమ్‌జమ్ నీరు తాగడానికి పనికి రానిదని రాశాడు. బహుశా అది ఆయన ముస్లింలకు వ్యతిరేకంగా సంకుచిత భావంతో రాసి ఉంటాడేమోనని తారిఖ్ హుసేన్ అనుకున్నాడు. అయితే ఈ విషయం రాజు ఫైసల్ చెవిన పడింది. ఆయన కోపగించుకుని ఈ వాదనను అంగీకరించలేదు. పైగా వెంటనే వ్యవసాయం, నీటి వనరుల మంత్రిత్వశాఖకు జమ్‌జమ్ నీటి నమూనాలను యూరొపియన్ ప్రయోగశాలల్లో పరీక్షింపజేసి తాగేందుకు యోగ్యమైనదా, కాదా తెలుసుకోమని ఉత్తర్వులిచ్చారు.

దాంతో ఆ మంత్రిత్వశాఖ జిద్దాలోని పవర్ అండ్ డిసాలినేషన్ ప్లాంట్స్ ఆ కార్యాన్ని అప్పగించింది. అప్పుడు నేను(తారిఖ్ హుస్సేన్) డిసాల్టింగ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. సముద్రపు నీటి నుంచి తాగేనీరు తయారు చేసే పని నాది. అప్పుడు జమ్‌జమ్ బావి నీరు ఎలాంటిదన్న ఊహ కూడా నాకు లేదు. నేను వెంటనే మక్కాకు వెళ్ళి అక్కడి అధికారులతో నేనే పని మీద వచ్చింది తెలిపాను. అప్పుడు అక్కడి అధికారులు నాకొక సేవకుడిని ఇచ్చి నాకేమేమి అవసరమో అవి చూడమన్నారు.

నేను జమ్‌జమ్ బావి వద్దకు వెళ్ళినప్పుడు అది చూసి, ఇంత చిన్న జల ప్రదేశం అది కూడా 18, 14 అడుగుల వెడల్పు, పొడవు ఉన్న నీటి వనరా లక్షలాది మంది దప్పికను తీరుస్తున్నది, లక్షలాది గ్యాలన్ల నీటిని అందిస్తున్నది అని ఆశ్చర్యపోయాను. బావి కొలతలు తీసుకొని నా పరిశోధన ఆరంభించాను. బావి లోతు ఏమిటో చెప్పమని నా సహాయకుడిని అడిగాను. అతడు ముందు బయట స్నానమాచరించి జమ్‌జమ్ బావిలోకి దిగాడు. అతడా బావిలో నిటారుగా నిలుచోగా నీటి స్థాయి అతడి భుజాల మేరకే ఉండడం నేను గమనించాను. అతడి ఎత్తు కేవలం ఐదు అడుగుల ఎనిమిది అంగుళాలే. ఆ తరువాత అతడు ఆ బావి అటూఇటు నిలుచునే తిరిగాడు. కనీసం ఎక్కడ తల మునగనైనా లేదు. ఆ బావిలోకి నీరెక్కడి నుంచి ఎలా వస్తోంది. అడుగున ఏవైనా పైపులు ఉన్నాయోమోనని వెతికాడు. బావి అడుగున అలాంటివేవీ లేవని చెప్పాడు. ఆ తరువాత బావిలో ఒకచోట నిలుచుని ఉండమని అతడికి ఆజ్ఞాపించాను. అతడు అలాగే ఒకచోట నిలబడ్డాడు. బావిలో ఏమి జరుగుతున్నట్లుందో గమనించమన్నాను. కొద్దిసేపటికి అతడు తన చేతులు పైకెత్తి 'అల్‌హమ్దులిల్లాహ్! కనుగొన్నాను. నా అరికాళ్ళ కింద ఇసుక నాట్యమాడుతున్నట్లుంది. అడుగు నుంచి నీరు ఊటగా వస్తున్నది'' అన్నాడు. పంపింగ్ జరుగుతున్నప్పుడు సైతం బావి అడుగు భాగమంతా ఒకే రీతిలో ఊట ఊరడం అతడు గమనించాడు.''

నేను గమనించాల్సిందంతా గమనించాక నీటి నమూనాలు తీసుకుని యూరొప్ ప్రయోగశాలకు పరీక్ష నిమిత్తం పంపించాను. మక్కాలో చుట్టుపక్కల బావుల సంగతి కూడా అధికారులను అడిగి తెలుసుకున్నాను. అయితే అవన్నీ చాలావరకు ఎండిపోయాయని వారు తెలిపారు. నేను జిద్దాలోని మా ఆఫీసుకు వెళ్ళాక ఏమేమి కనుగొన్నది నివేదిక తయారు చేశాను. నా బాస్ నేను చెప్పిందంతా విని బహుశా జమ్‌జమ్ బావి అంతర్గతంగా ఎర్ర సముద్రంతో సంధానమై ఉందేమోనని ఓ అసందర్భపు వ్యాఖ్య చేశాడు. ఎర్ర సముద్రానికి మక్కా 75 కి.మీ. దూరంలో ఉంది. పైగా మక్కాలోని ఇతర బావులు చాలావరకు ఎండిపోయాయి. అలాంటి స్థితిలో జమ్‌జమ్ బావి అంతర్గతంగా ఎర్ర సముద్రంతో సంధానమై ఉండడం ఎలా సాధ్యం.

జమ్‌జమ్ నీటి నమూనాలను యూరొప్ ప్రయోగశాలలు పరీక్షించాయి. మేము కూడా మా ప్రయోగశాలల్లో విశ్లేషించాము. వాటి ఫలితాలు ఒకేలా తేలాయి. జమ్‌జమ్ నీటిలో కాల్షియం, మెగ్నీషియం లవణాలు ఇతర నీళ్ళలో కంటే ఎక్కువ ఉన్నాయి.

అందుకే హాజీలకు జమ్‌జమ్ నీళ్ళు పునరుత్తేజితులను చేస్తుందనుకుంటా. జమ్‌జమ్ నీటిలో క్రిమినాశని అయిన ఫ్లోరైడ్ కూడా ఉంది.

యూరొప్ ప్రయోగశాలలు జమ్‌జమ్ నీరు త్రాగుటకు ఉపయుక్తమయినదనే తెలిపాయి. దాంతో రాజు ఫైసల్ ఎంతో ఆనందించాడు. యూరొపియన్ ప్రెస్ వ్యతిరేకంగా రాసినందుకు మందలించాడు. జమ్‌జమ్ నీటి మహత్తుపై మరిన్ని ప్రయోగాలు జరగాల్సి వుంది.

## జమ్‌జమ్ ప్రత్యేకతలు

జమ్‌జమ్ బావి ఎన్నడూ ఎండిపోలేదు. ఎంత మందికైనా నీటిని అందించే సామర్థ్యం కలిగివుంది. జమ్‌జమ్ ఆవిర్భవించిన నాటి నుంచి నేటివరకు దానిలోని లవణాలు, రుచి ఒకేలా ఉన్నాయి.

జమ్‌జమ్ నీటిని ప్రపంచమంతటా ఎక్కడికైనా తీసుకెళ్ళవచ్చు. ఆరోగ్యపరమైన ముప్పులేదు.

సాధారణంగా మామూలు నీరు వేర్వేరు ప్రదేశాలలో వేర్వేరు రుచులలో ఉంటుంది. కానీ జమ్‌జమ్ నీటిని ఏ ప్రదేశానికి తీసుకెళ్ళినా అదే రుచి వుంటుంది. జమ్‌జమ్ నీటిని రసాయనికంగా శుద్ధి చేయడం లేక క్లోరిన్ కలపడం వంటిదేదీ ఉండదు. జమ్‌జమ్ బావిలో నాచు, పాచు వంటివేమి పెరగవు. పైగా వాసన సమస్య ఉండదు.

# తెలుసుకోవాల్సిన అరబీ పదాలు

| | |
|---|---|
| వంకాయ | బితింజాన్ |
| క్యారెట్ | జీసర్ |
| ఆలుగడ్డ | బతాత |
| ఉల్లిగడ్డ | బసల్ |
| మిర్చకాయ | ఫిల్ ఫిల్ |
| టమాటా | తమత్ |
| అల్లమ్ | జాంజెబీర్ |
| పసుపు | కురుకుమ్ |
| ఉప్పు | మల్ హా |
| దల్చినా చేక్కా | దస్సిన్ |
| యాలకులు | హేల్ |
| లవంగా | రువేది |
| జిలాకర్ర | కామున్ |
| చాయి పత్తి | నౌసన్ |
| బెండకాయ | బామియా |
| సోరకాయ (అనికాయ) | గేర్ |
| కొబ్బరికాయ | జెసర్హిద్ |
| కొతిమీరా | కోస్ బారా |
| దోసాకాయ | క్యార్ |
| దోసాకాయ | కుసా |
| గట్టి తౌసుల ( పొడి ) | బక్సమ్ బొద్ర |
| పాలకుర లా ఉంటది | జార్ జిర్ |
| క్యాబెజి అకులా ఉంటుంది.. | కస్(సలత్) |

**భోజనాన్ని ఎమంటారు...**

| | |
|---|---|
| ప్రొద్దున నస్టా | రియూఖ్(గ్),ఫతుర్ |
| మధ్యన భోజనం | ఖదా |
| రాత్రి భోజనం | అశా.. |

తెలుగు:- నువ్వు మధ్యాహ్నం భోజనం తిన్నావా ...?

అరబి :- ఇంతే అఖిల్ గదా ...?

**వెజ్ నాన్ వేజ్ వండుకునే కూరలు:**

| | |
|---|---|
| కోడి | జిజాజ్ |
| కోడి (కురా) | జిజాజ్ (మర్రాక్ ) |
| కోడి గుడ్డుని | జిజాజ్ బేద్.. |
| కోడి బిర్యాని | జిజాజ్ మచ్బుస్ (మజుబుస్) |
| గొర్రె | ఖరుఫ్,గనామ్,రకల్ |
| మటాన్ | లాహమ్ |
| మటాన్ బిర్యాని | లాహమ్ మజుబుస్ |

# హజ్రె అస్వద్

మక్కాలోని కాబాలో ఉన్న నల్ల రాయిని అరబీ భాషలో అల్ హజర్ అల్ అస్వద్ అంటారు. అనేక భూగోళ శాస్త్రజ్ఞులు మరియు చరిత్రకారులు దీన్ని ఉల్కా అంటారు. కాబాలో ఇది తూర్పు దిశ మూలలో ఉంది. ఇది నల్లగా ఉంది. ఇబ్రాహీం అలైహిస్సలాం కాబా నిర్మాణం పూర్తి చేశాక, ఒక రాయి తక్కువ పడితే, ఇస్మాయిల్ అలైహిస్సలాంను వెతకమన్నారు. ఇస్మాయిల్ అలైహిస్సలాం చాలా వెతికారు, కాని దొరకక పోవడంతో తిరిగి వచ్చి చూస్తే, తన తండ్రి ఒక రాయిని పెట్టేశారు. అప్పుడు ఆయన తన తండ్రిని ఇలా అడిగారు: "ఓ తండ్రి! ఈ రాయి ఎక్కడ దొరికింది?" దానికి ఇబ్రాహీం అలైహిస్సలాం ఇలా జవాబిచ్చారు: "జిబ్రయీల్ అలైహిస్సలాం స్వర్గం నుంచి తెచ్చారు."

ఈ విధంగా కాబా నిర్మాణం పూర్తి అయ్యింది. ఈ రాయి స్వర్గం నుంచి తెచ్చినప్పుడు పాల కన్నా తెల్లగా ఉండింది. దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం ఇలా అన్నారు: "నల్ల రాయి స్వర్గం నుంచి పంపబడినప్పుడు పాల కంటే తెల్లగా ఉండేది. ప్రజల పాపాల వల్ల అది నల్లగా మారిపోయింది." (తిర్మిజి 2577)

కాబాను పునర్నిర్మించడానికి ఖురైషులు దాన్ని పడగొట్టినప్పుడు, నల్ల రాయి వరకు నిర్మాణం పూర్తిచేశాక, ఒక వివాదం తలెత్తింది. నల్ల రాయిని దాని స్థలంలో ఎవరు ఉంచాలి అనే దానిపై తర్జన భర్జన జరగసాగింది. ఆ వివాదం యుద్ధానికి దారి తీసేలా కనిపించసాగింది. బనూ అబ్దుద్ దార్ ఒక పాత్ర నిండా రక్తం తీసుకు వచ్చాడు. అన్ని తెగలకు చెందిన వారు అందులో చేతులు ముంచారు. ఇక అందరూ యుద్దానికి సిద్ధమయ్యారు. వారిలో ఒక పెద్దాయన అబూ ఉమయ్యా ఇబ్న్ అల్ ముఘీరా ఒక ప్రస్తావన ఉంచాడు. అదేమిటంటే, బనీ షైబా ద్వారం గుండా ఎవరైతే మొదట వస్తారో, వారి తీర్పు స్వీకరిద్దాము. దీనికి అందరూ ఒప్పుకున్నారు. ఆ ద్వారం గుండా దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం మొట్ట మొదట వచ్చారు. ఈ సంఘటన దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం ప్రవక్తగా నియమించబడటానికి ఐదు సంవత్సరాల ముందు జరిగింది. దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం నల్ల రాయిని ఒక దుప్పట్లో ఉంచి, దాని కొసలను ప్రతి జాతికి చెందిన ఒక మనిషిని పట్టుకోమన్నారు. ఇలా పట్టుకుని దాన్ని దాని స్థలానికి దగ్గరగా తెచ్చారు. అప్పుడు దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం తన స్వంత హస్తాలతో దాన్ని దాని అసలు స్థానంలో ఉంచారు. ఈ విధంగా దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం తన వివేకం ద్వారా ఒక పెద్ద యుద్ధాన్ని నివారించారు.

ఇస్మాయిలి షియా తెగకు చెందిన ఖర్మాతియన్ యోధులు 930CE లో హజరె అస్వద్ ను దొంగిలించారు. వారు మక్కా వాసులను చంపి, వారి శవాలను జంజం బావిలో పడేశారు. హజరె అస్వద్ (నల్ల రాయిని)ను తమతో పాటు ప్రాచీన బహరైన్‌లోని తమ స్థావరం అయిన ఇహ్సాకు తీసుకెళ్ళారు. అల్ జువైని అనే చరిత్రకారుని ప్రకారం నల్ల రాయి తిరిగి తన స్థానంలో 952 CE లో చేర్చబడింది.

హజరె అస్వద్ ముందు ఒకటిగా ఉండేది. కాని అనేక చారిత్రక సంఘటనల వల్ల అది ఇప్పుడు ఎనిమిది ముక్కలుగా చేయబడింది. ఈ ముక్కలు వివిధ సైజుల్లో ఉన్నాయి. ఈ ముక్కలన్నీ ఒక పెద్ద రాయికి అతికించి దాన్ని వెండి ఫ్రేములో పొదిగించారు. ఈ వెండి ఫ్రేమును మొదట అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) చేయించారు. ఆ తరువాత అవకాశాన్ని బట్టి ఖలీఫాలు దాన్ని మార్చారు.

ఆరు (అదనపు) ముక్కలు టర్కీలోని ఇస్తాంబుల్‌లో ఉన్నాయని టర్కీయులు దావా చేస్తున్నారు. అవి నీల మస్జిద్ (బ్లూ మోస్క్)లో ఉన్నాయని వారు

అంటారు. దీని ధృవీకరణ ప్రశ్నార్థకం. తుర్కీయులు అనేక సంవత్సరాలు సౌదీ అరబియాపై పరిపాలన చేశారు. అనేక ఇస్లామీయ అవశేషాలను తమతో పాటు తీసుకెళ్ళారు. కాబట్టి దీని గురించి అల్లాహ్‌కే తెలుసు.

అబూ తుఫైల్ ఇలా అన్నారని ఉల్లేఖించ బడింది: "దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం కాబా తవాఫ్ చేస్తూ, హజరె అస్వద్ (నల్ల రాయి)ను తనతో ఉన్న ఒక కర్రతో స్పర్శించారు. ఆ తరువాత ఆ కర్రను ముద్దు పెట్టుకున్నారు." (సహీహ్ ముస్లిం 1275)

ఇబ్నే అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: "దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం తన ఒంటెపై తవాఫ్ చేశారు. ప్రతి సారి నల్ల రాయి (హజరె అస్వద్) ఉన్న కొసకు రాగానే, దాని వైపు సైగ చేసి 'అల్లాహు అక్బర్' అనేవారు." (సహీహ్ బుఖారీ 4987)

నల్లరాయి గురించి అనేక హదీసులు ఉన్నాయి. వాటిని క్రింద పేర్కొనడం జరిగింది.

నల్లరాయిని అల్లాహ్ స్వర్గం నుండి భూమిపై పంపించాడు. ఇబ్నే అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం ఇలా అన్నారు: "నల్లరాయి స్వర్గం నుండి వచ్చింది." (తిర్మిజి 877, నసాయి 2935)

ఈ రాయి పాల కంటే తెల్లగా ఉండేది. కాని ఆదం సంతానం పాపాల మూలంగా ఇది నల్లగా మారింది. ఇబ్నే అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం ఇలా అన్నారు: "నల్ల రాయి స్వర్గం నుండి వచ్చినప్పుడు పాల కంటే తెల్లగా ఉండేది. కాని, ఆదం సంతానం యొక్క పాపాల వల్ల అది నల్లదై పోయింది." (తిర్మిజి 877బీ అహ్మద్ 2792, ఇబ్నే ఖుజైమిన్ సహీహ్ అని ధృవీకరించారు 4/219)

అల్ ముబారక్ పూరి (రహి) అల్ మరాలో ఇలా అన్నారు: ఆదం సంతానం పాపాల వల్ల, వారు తాకిన ఈ రాయి నల్లగా మారిపోయింది.

అల్ హాఫిజ్ ఇబ్నే హజర్ (రహి) ఇలా అన్నారు: కొందరు ఈ హదీసును విమర్శిస్తూ ఇలా అన్నారు: బహుదైవారాధకుల పాపాలు దీన్ని నల్లగా మార్చినప్పుడు, ఏకదైవారాధన చేసే వారి ఆరాధనలు దీన్ని ఎందుకు తెల్లగా మార్చలేదు? ఇబ్నే ఖుతైబా చెప్పినదాన్ని నేను జవాబుగా చెబుతున్నాను: అల్లాహ్ తలిస్తే, ఇలా జరిగేది. నల్ల రంగు ఇతర రంగులను మారుస్తుంది, కాని స్వంత రంగును మార్చుకోలేదు. తెల్ల రంగు ఇతర రంగులను మారుస్తుంది మరియు స్వంత రంగును కూడా మార్చుకుంటుంది. అల్లాహ్ ఇలా చేశాడు.

అల్ ముహిబ్బ్ అల్ తబరీ ఇలా అన్నారు: అంతర్దృష్టి గలవారికి ఇది నల్లగా ఉండడంలో ఒక పాఠం ఉంది. మానవుని పాపాలు ఒక ప్రాణం లేని రాయి మీద ఇంతగా ప్రభావం చూపించగలిగినప్పుడు, మానవుని హృదయంపై ఇంకెంత ప్రాభవం వేయగలవో ఊహించండి. (ఫత్ హుల్ బారి 3/463)

నల్ల రాయి తీర్పు దినాన వచ్చి, తనను తాకిన వారి పక్షంలో సాక్ష్యం ఇస్తుంది.

ఇబ్నే అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం నల్ల రాయి గురించి ఇలా అన్నారు: "అంతిమ దినాన అల్లాహ్ నల్ల రాయిని తీసుకు వస్తాడు. అప్పుడు దానికి రెండు కళ్ళు ఉంటాయి, దాంతో అది చూస్తుంది మరియు నాలుక ఉంటుంది, దానితో అది మాట్లాడుతుంది. దాన్ని మనస్ఫూర్తిగా తాకిన వారి గురించి అది సాక్ష్యం ఇస్తుంది." (తిర్మిజి 961బీ ఇబ్నే మాజా 2944)

హజ్ కోసమైనా, ఉమ్రా కోసమైనా లేదా నఫిల్ తవాఫ్ అయినా నల్ల రాయిని తాకడం, చుంబించడం లేదా దాని వైపు సైగ చేయడం తవాఫ్ మొదలు పెట్టే ముందు చేయవలసిన పని.

జాబిర్ ఇబ్నే అబ్దుల్లా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం మక్కాకు వచ్చినప్పుడు, తవాఫ్ చేసే ముందు నల్ల రాయి కొసను ముద్దాడేవారు. ఆ తరువాత తవాఫ్ లోని ఏడు ప్రదక్షిణల్లో, మొదటి మూడింటిలో రమల్ (వేగంగా నడవడం) చేసేవారు. (సహీహ్ బుఖారీ 2.673 సహీహ్ ముస్లిం 1218)

దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం నల్ల రాయిని ముద్దాడారు. ఆయన అనుచరులు (ముస్లింలు) వారిని అనుసరించారు.

ఉమర్ (రజి) నల్ల రాయి వద్దకు వచ్చి, దాన్ని ముద్దాడారు. ఆ తరువాత ఇలా అన్నారు: "నీవు కేవలం ఒక రాయివి అని నాకు తెలుసు. నీవు నాకు లాభం గానీ, నష్టం గానీ కలిగించలేవు. దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం నిన్ను ముద్దాడుతూ నేను చూసి ఉండక పోతే, నేను నిన్ను ముద్దాడే వాణ్ని కాదు." (సహీహ్ బుఖారీ 1520: సహీహ్ ముస్లిం 1720)

ఎవరైనా నల్ల రాయిని చుంబించ లేకపోతే, అతను దాన్ని చేతితో తాకడానికి ప్రయత్నించాలి లేదా ఇతర దేనితోనైనా తాకి, దాన్ని చుంబించవచ్చు.

అబూ తుఫైల్ ఇలా అన్నారని ఉల్లేఖించ బడింది: "దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం కాబా తవాఫ్ చేస్తూ, హజరె అస్వద్ (నల్లరాయి) ఉన్న కొనను స్పర్శించారు. ఆ తరువాత తనతో ఉన్న సిబ్బందిని ముద్దు పెట్టుకున్నారు." (సహీహ్ ముస్లిం 1275)

ఒకవేళ ఎవరైనా పై దానిని చేయలేని పక్షంలో, అతను తన చేతితో సైగ చేస్తూ "అల్లాహు అక్బర్" అనాలి. ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం తన ఒంటెపై తవాఫ్ చేశారు. నల్ల రాయి ఉన్న కొనకు వచ్చిన ప్రతి సారి దాని వైపు సైగ చేసి "అల్లాహు అక్బర్" అనేవారు. (సహీహ్ బుఖారీ 4987)

నల్ల రాయిని తాకడం వల్ల అల్లాహ్ మనిషి పాపాలను మన్నిస్తాడు. ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం ఇలా అన్నారు: "ఆ రెండిటినీ (నల్ల రాయి మరియు రుక్నె యమాని)ని తాకిన వారి పాపాలు మన్నించబడుతాయి." (తిర్మిజి 959)

అపోహ : రాయి దైవం కాగలదా?

తవాఫ్‌లో నల్ల రాయిని అంతగా చుంబించిననూ, ముట్టు కున్ననూ ముస్లింలు దీన్ని పూజించరు. ఒక్క అల్లాహ్‌ను ఆరాధించే వారు ఎవరూ ఇలా ఆలోచించరు. ఇది వారికి ఒక రాయి మాత్రమే. ఇది ఎవరికీ ఎలాంటి మేలు లేదా చెడు కలిగించజాలదు. మేలు లేదా చెడు కలిగించే అధికారం కేవలం ఒక్కడైన అల్లాహ్‌కు మాత్రమే ఉంది. ఒక్క అల్లాహ్‌ను ఆరాధించే వారెవరూ ఇలా చేయరు. కేవలం బహుదైవారాధకులు మాత్రమే ఇలా చేస్తారు.

ఇలాంటి వారికి నల్ల రాయి ఓ రహస్యంగా మారిపోయింది. అజ్ఞానం కారణంగా వీరు దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం కాబాలోని విగ్రహాలన్నిటిని విరగ్గొట్టి కేవలం కాబాను లేదా నల్ల రాయిని విడిచిపెట్టారు అని అంటారు. అంతెందుకు కొందరు ముస్లింలు కూడా సందేహానికి లోనవుతారు.

అందుకే రెండో ఖలీఫా ఉమర్ (రజి) ప్రజల్లోని ఈ సందేహాన్ని చెరపడానికే, దాన్ని (నల్ల రాయిని) చుంబించడానికి వచ్చినప్పుడు అందరు వినేలా బిగ్గరగా ఇలా అన్నారు: అబిస్ బిన్ రబియా ఉల్లేఖించారు:
ఉమర్ (రజి) నల్ల రాయి వద్దకు వచ్చి, దాన్ని చుంబించి ఇలా అన్నారు: "నిస్సందేహంగా నీవు ఒక రాయివి మాత్రమే. నీవు ఎవరికీ ఎలాంటి మంచి లేదా చెడు కలిగించలేవు. నేను గనక దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం నిన్ను చుంబిస్తూ చూడకపోతే, నిన్ను ఎన్నటికీ చుంబించే వాడిని కాను." (సహీహ్ బుఖారీ 808)

రాయిని చుంబించడం, దాన్ని ఆరాధించినట్లు కాదు. నల్ల రాయిని చుంబించడం విగ్రహారాధన చేసినట్లు అవదు. ఎందుకంటే, రాయి ఒక రూపం కాదు. కొందరు, ముస్లింలు విగ్రహారాధన చేస్తారు అని అంటారు. కాని, వాస్తవం ఏమిటంటే ముస్లింలు ఒక్కడైన అల్లాహ్ తప్ప ఎవరినీ ఆరాధించరు.

అల్లాహ్! తన అనుమతితో, మిమ్మల్ని స్వర్గం వైపునకు మరియు క్షమాభిక్షపొందటానికి పిలుస్తున్నాడు. మరియు ఈ విధంగా ఆయన తన సూచనలను ప్రజలకు బహుశా వారు గుణపాఠం నేర్చుకుంటారని స్పష్టంగా తెలుపు తున్నాడు.

-డా.ఫజులుల్లా ఖాన్

# నమాజు ఎందుకంటే..

ప్రపంచంలోని ప్రతి మస్జిద్ నమాజ్లతో కళకళలాడుతూ ఉంటుంది. ప్రతిరోజూ ఇస్లాం ధర్మ నియమావళి ప్రకారం, ప్రపంచంలో ఉన్న ముస్లింలు అయిదు పూటల నమాజ్‌ను విధిగా, తప్పనిసరిగా పాటించాలని అల్లాహ్ ఆదేశించాడు. అలాగే వారానికి ఒకసారి దైవాజ్ఞలను వినడానికి నమాజ్‌ను కూడా చేయాలని ముస్లింలను ఆదేశించాడు.

'అంతిమ దివ్య ఖురాన్'లో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: "విశ్వసించిన ప్రజలారా! శుక్రవారం నాడు నమాజ్ కోసం పిలిచినప్పుడు దైవ సంస్మరణ వైపు పరుగెత్తండి. క్రయవిక్రయాలను విడిచిపెట్టండి. మీరు గ్రహించగలిగితే ఇదే మీకు అత్యంత శ్రేయస్కరమైనది." (62:9)

ఇక, అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ ఈ విధంగా ప్రవచించారు: 'ఎవరైనా జుమా రోజు గుస్ల్ (తలస్నానం) చేసి జుమా నమాజ్ కోసం మస్జిద్‌కు వెళ్ళి అక్కడ నమాజు చేసి, ఇమామ్ ఉపన్యాసం 'ఖుత్బా' శ్రద్ధగా విని, ఇమామ్ గారితో పాటు 'ఫర్జ్' నమాజ్ చేస్తే, గత శుక్రవారం నుండి ఈ శుక్రవారం వరకు అతని వలన జరిగిన పాపాలన్నీ మన్నించబడతాయి.' అలాగే, అంతిమ దైవ ప్రవక్త 'జుమా' నమాజ్ నుంచి మినహాయింపు పొందిన వారి గురించి ఇలా తెలిపారు: "జుమా నమాజ్ను సామూహికంగా చేయడం ముస్లింలకు విధి. అయితే బానిసలకూ, స్త్రీలకూ, చిన్నపిల్లలకూ, వ్యాధిగ్రస్థులకూ, ప్రయాణికులకూ మినహాయింపు ఉంది." సూర్యుడు ఉదయించే రోజులన్నింటికెల్లా జుమా రోజు అత్యంత శ్రేష్ఠమైనది.

**ఉపవాసం, జకాత్, హజ్ తదితర ఆదేశాలన్నియూ ప్రవక్త భువిపై ఉండగా ఇవ్వబడ్డాయి, కాని నమాజ్ విషయానికొస్తే అల్లాహ్ ప్రవక్తను దివిపైకి పిలుచుకొని గొప్ప బహుమానంగా ప్రసాదించాడు. అందుకే దీనికున్నంత ప్రాముఖ్యత, ఘనత మరే ఆరాధనకు లేదు, ఇది ప్రతి ముస్లింపై ఐదు వేళల్లో పాటించడం విధిగా ఉంది. నమాజు లాభాలు ఇలా ఉన్నాయి:**

1 మస్జిద్‌కు వెళ్ళే వ్యక్తి యొక్క జామిన్ అల్లాహ్ ఉన్నాడు. (అబూదావూద్ 2494).

2 మస్జిద్‌కు వచ్చిపోయే ప్రతి అడుగుకు బదులు ఒక పుణ్యం పెరిగి, ఒక పాపం తగ్గుతుంది. (ముస్లిం 654).

3 నమాజు చేసేవారికి తోడుగా అల్లాహ్ ఉన్నాడు. (సూర మాఇద 5:12).

4 నమాజు చేసేవారికి అల్లాహ్ వద్ద ఉన్నత స్థానాలు, మన్నింపు, గౌరవప్రదమైన ఆహారం ఉంది. (సూర అన్‌ఫాల్ 8:3,4).

5 మస్జిద్‌లో నమాజు స్థాపించేవారే సన్మార్గ భాగ్యులు. (తౌబా 9:18).

6 నమాజు చేయువారికి ప్రళయదినాన ప్రవక్త తోడు ప్రాప్తియగును. (ముస్లిం 489).

7 నమాజుకై మస్జిద్‌కు వెళ్ళినప్పుడల్లా అల్లాహ్ స్వర్గంలో ఆతిథ్యం ఏర్పాటు చేస్తాడు. (బుఖారి 662, ముస్లిం 669).

8 ఫర్జ్ నమాజు కొరకు మస్జిద్‌కు వెళ్ళినప్పుడల్లా హజ్ చేసినంత పుణ్యం, అదే చాష్త్ నమాజ్ చేసినప్పుడల్లా ఉమ్రా చేసినంత పుణ్యం లభిస్తుంది. (అబూ దావూద్ 558).

9 చీకటి వేళల్లో నమాజుకై మస్జిద్‌కు వెళ్ళే వారి కొరకు అల్లాహ్ ప్రళయదినాన సంపూర్ణ కాంతి ప్రసాదిస్తాడు. (అబూ దావూద్ 561).

10 నమాజు చేయడం వల్ల మనిషి చెడు నడత, అశ్లీలత నుండి దూరంగా ఉండగలడు. (అన్ కబూత్ 45).

11 సరియైన పద్ధతిలో నమాజు చేస్తే మనిషిలోని దురాశ, అత్యాశ, కలవరం, పిసినారితనాలు దూరమవుతాయి. (మఆరిజ్ 19-21).

**నమాజును స్థాపించనివారు ఎవరు? ఇహపరాల్లో వారికి ఎలాంటి శిక్ష ఉంటుంది? సమాధిలో వారి గతి ఏమవుతుంది? ఖుర్ఆన్ హదీసు ఆధారంగా సంక్షిప్త రూపంలో తెలుసుకుందాం.**

1 నమాజు చేయడంలో అశ్రద్ధ వహించేవారికి 'వైల్' ఉంది (మాఊన్ 4,5).

2 నమాజులో బద్ధకం చేసేవారు అపమార్గంలో ఉన్నారు. (నిసా 141,142).

3 నమాజులో సోమరితనం చూపేవారి వద్ద ఎంత ఆస్తి సంపద, పిల్లలు ఉన్నా అవి వారికి ఓ శిక్ష లాంటివే. (తౌబా 54,55).

4 వేళ తప్పి, తనిష్టానుసారం నమాజుచేసే వారి కొరకు 'ఘయ్యీ' ఉంది(అంటే వినాశం, దుర్గతి, నరకంలోని ఓ గుండం).

5 ఇక పూర్తిగా నమాజు చేయనివారి స్థానం నరకం. (ముద్దస్సిర్ 42,43).

6 వ్యాపారం, వ్యవసాయం, సంతానం సాకుతో నమాజు వదిలితే అలాంటి వారు నష్టంలో ఉన్నారు.(మునాఫిఖూన్ 9).

7 నమాజు విషయాన్ని ఎగితాళి చేసేవారు, పరిహసించేవారు బుద్ధిజ్ఞానాలకు అతిదూరం ఉన్నవారు. (మాఇద 58).

8 నమాజు చేయనివారు ముష్రికులు (రూం 31).

9 ముస్లిం మరియు కాఫిర్ల మధ్యలో వ్యత్యాసం నమాజు మానడమే. (ముస్లిం 82).

10 నమాజు చేయని వారికి ప్రళయదినాన ఏలాంటి నిదర్శనం, కాంతి, మోక్షము ఉండదు, ఇంకా అతను ఖారూన్, హామాన్, ఫిర్ఔన్ మరియు ఉబయ్యీ బిన్ ఖలఫ్‌లకు తోడుగా ఉంటాడు. (ముస్నద్ అహ్మద్ 11/141).

11 ప్రళయదినాన తొలి ప్రశ్న నమాజు గురించే. (అబూదావూద్ 864).

-డా.ఫజులుల్లా ఖాన్

# ఇతరుల ఇంట్లోకి తొంగి చూడడం నిషిద్ధం

*హజ్రత్ సహెల్ బిన్ సాద్ సాది (రజి అల్లాహు అన్హు) కథనం :- ఒకవ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంటికెళ్ళి తలుపు కన్నంలో నుంచి లోపలికి తొంగి చూడసాగాడు. ఆ సమయంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేతిలో మొనలు గల ఒక ఇనుప దువ్వెన ఉంది. దాంతో ఆయన తల గోక్కుంటున్నారు. ఆయన తలుపు సందు నుండి తొంగి చూస్తున్న ఆ వ్యక్తిని చూసి "నీవు నన్ను ఇలా తొంగి చూస్తున్నావని తెలిస్తే నేనీ దువ్వెనతోనే కంట్లో పొడిచేస్తాను" అని అన్నారు. ఆ తరువాత అతనితో "ఇలా తొంగి చూడరాదన్న ఉద్దేశ్యంతోనే అనుమతి తీసుకోవాలని ఆదేశించడం జరిగింది" అని అన్నారు.*

*1393 సహీహ్ బుఖారీ:89 వ ప్రకరణం - అద్దియాత్, 23 వ అధ్యాయం - మనిత్తల ఫీబైతి ఖౌమ్ ఫఫఖవూ అయినహూ ఫలాదియత లాహూ సంస్కార ప్రకరణం:9 వ అధ్యాయం ఇతరుల ఇండ్లలో తొంగి చూడరాదు మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మహితోక్తులు*
*A-Lodu Wal Marjan vol-2*

# హజ్ మూడవ రోజు

-ముఫ్తి ముహమ్మద్ ఫారూక్ అల్ ఖాసిమీ

ఫజ్ర్ నమాజ్ ప్రారంభవేళలో చదవండి. ఆ తర్వాత ఎంతో సేపటివరకు అల్లాహ్ స్మరణలో మరియు దుఆ చేయడంలో గడపండి. సూర్యోదయం అయిన తరువాత అక్కడి నుంచి మినా వైపుకు పయనాన్ని ఆరంభించండి.

### ముజ్దలిఫహ్ నుంచి మినా వైపుకు

ముజ్దలిఫహ్ నుంచి మినా 7 కి.మీ. దూరంలో వుంది. నడిచి వెళ్తే 2 గంటల సమయం పడుతుంది. అక్కడికి చేరుకొని ఈ రోజు మీరు ఎన్నో పనులు చేయవలసియుంటుంది. మొదటి పని ఏమిటంటే మీరు మూడు జమ్రాలలో (వీటిని ప్రజలు 'షైతాన్‌లు' అని పేర్కొంటారు) అన్నింటికంటే చివరగా ఉండే మూడవ జమ్రహ్‌పై ఏడు కంకరరాళ్ళు విసురుతారు. నేడు ఆ కంకరరాళ్ళతో మిట్టమధ్యాహ్నా వేళకు ముందే కేవలం ఆ ఒక్క జమ్రహ్ పై మాత్రమే కొట్టాలి.

కంకరరాళ్ళు విసిరేందుకై జమ్రహ్ నుంచి రెండు లేదా రెండున్నర గజాల దూరంగా ఏవిధంగా నిలబడాలంటే మినా మీకు కుడివైపున ఉండాలి, మక్కా ఎడమవైపున ఉండాలి. ఏడు కంకరరాళ్ళను ఏడు పర్యాయాలు మీ చూపుడువేలు మరియు బొటనవేలితో పట్టుకొని విసర వలసియుంటుంది. ప్రతి రాతిని విసిరే సమయంలో 'బిస్మిల్లాహి అల్లాహు అక్బర్' అని పఠించాలి.

### తల్బియహ్ ముగింపు

హజ్ కు సంబంధించిన ఇహ్రామ్ కట్టుకున్నప్పుడు ఆరంభమయిన తల్బియహ్ ('లబ్బైక అల్లాహుమ్మ లబ్బైక లబ్బైక లా షరీక లక లబ్బైక ఇన్నల్ హమ్‌ద వన్నిఅ్‌మత లక వల్ ముల్‌క లా షరీక లక్ ' అనే సద్వచనం), దేనినయితే మీరు నడుస్తూ, ఎక్కుతూ, దిగుతూ ప్రతిచోటా పఠించారో అది నేడు ఈ కంకరరాళ్ళను కొట్టిన తర్వాత దాని పరంపర ముగిసిపోతుంది. ఇప్పుడు మీరు అల్లాహ్ స్మరణకు సంబంధించిన ఇతర సద్వచనాలను పఠిస్తూ ఉండండి. ఇక తల్బియహ్ ను పఠించడానికి

సంబంధించిన ఆదేశం ఇప్పటి నుంచి మీకు వర్తించదు.

**ఖుర్‌బానీ**

ఆ విధంగా కంకరరాళ్ళను విసిరిన తర్వాత మీరు ఖుర్‌బానీ ఇవ్వవలసియుంటుంది. దీనికి సంబంధించిన నియమమేమిటంటే ఏ హజ్ యాత్రికులయితే 'హజ్జె తమత్తుత్ ' చేస్తారో లేదా 'హజ్జె ఖిరాన్' చేస్తారో వారు ఒక్క ఖుర్‌బానీ ఇవ్వడం వాజిబ్ (తప్పనిసరి). ఏ హజ్ యాత్రికులయితే హజ్జె ఇఫ్‌రాద్ చేస్తారో వారు ఖుర్‌బానీ ఇవ్వడం వాజిబ్ (తప్పనిసరి) కాదు, ముస్తహబ్ మాత్రమే. మీరు హజ్జె తమత్తుత్ చేశారు గనుక మీరు ఖుర్‌బానీ ఇవ్వడం వాజిబ్ (తప్పనిసరి). కనుక కంకరరాళ్ళను విసిరిన తర్వాత మీరు నేరుగా ఖుర్‌బానీ ఇవ్వబడే స్థలానికి చేరుకొని అక్కడ మీకు ఇష్టమయిన ఖుర్‌బానీ జంతువును కొనుగోలు చేసి ఖుర్‌బానీ ఇవ్వండి.

హజ్ ఏ తమత్తు మరియు హజ్ ఏ కిరాన్ చేసే వారికి గల మధ్య తేడా హజ్ ఏ కిరాన్ చేసేవారికి ఏమిటంటే, హజ్ ఏ కిరాన్ చేసేవారు ఉమ్రా చేసిన తర్వాత ఇహ్రం ను తీసివేయకూడదు, ఆ విధంగా ఈ ఇహ్రామ్ జుల్ హజ్జా ఎనిమిదవ తేదీ వరకు ఉండాలి, ఈ రోజే హాజీలు హజ్జ్ చేయడానికి నిశ్చయించుకుంటారు.

హజ్ చేయని వారు ఈద్ ఉల్ అద్ హా రోజున ఖుర్బానీ ఇవ్వాలి, ఇది జుల్ హజ్ లోని పదవ తేదీ, ఈ రోజును ఉదియహ్ అని అంటారు.

హదీస్

సాలిం ఇబ్న్ అబ్దుల్లాహ్ ఉల్లేఖనం ప్రకారం ఇబ్న్ ఉమర్ (ర.జి) ఇలా చెప్పారు: ఇబ్న్ ఉమర్ (ర.జి) వారి అంతిమ హజ్ సమయంలో, అల్లాహ్ ప్రవక్త ఉమ్రా చేసిన తర్వాత హజ్ చేశారు. అలాగే హదియ్ (ఖుర్బానీ ఇచ్చే జంతువును) కూడా తీసుకెళ్ళారు. ఆ తర్వాత అయన సఫా మరియు మర్వా దగ్గరకు వెళ్లి వాటి మధ్యలో ఏడు సార్లు పరిగెత్తారు ఆ తర్వాత ఇహ్రామ్ స్థితిలో ఉన్నప్పుడు పూర్తి హజ్ అయ్యేవరకు మరియు(జుల్ హజ్ పదవ తేదీ) అనగా నహర్ రోజు హదీయ్ అనగా ఖుర్బానీ ఇచ్చేవరకు ఇహ్రామ్ స్తితిలో నిషేదించబడ్డ పనులను ప్రవక్త చేయలేదు. ఆ తర్వాత త్వరగా మక్కా వైపు వచ్చి కాబా దగ్గరికి వెళ్లి తవాఫ్ చేశారు, ఆ తర్వాత ఇహ్రామ్ స్తితిలో నిషేదించబడిన పనులు అన్నీతవాఫ్ తర్వాత అనుమతించబడ్డాయని, అని ఇబ్న్ ఉమర్(ర.జి) తెలియజేశారు. సహీహ్ అల్-బుఖారీ, **1691** మరియు సహీహ్ ముస్లిం **1227**

ఏ హజ్ యాత్రికుడు కూడా ఖుర్బానీనీ తన దేశంలో ఇస్తానని నిశ్చయించుకోకూడదు, ఎందుకనగా ఖుర్బానీ హజ్ లోని ఒక ఒక మూలస్థంభం, కాబట్టి ఖుర్బానీ మక్కాలోనే ఇవ్వాలి. ఒకవేళ హాజీ ఏదైనా చేసినందుకు దాని బదులుగా హజ్ లో ఖుర్బానీ ఇవ్వాలనుకోవడానికి కూడా అనుమతిలేదు, అలాగే తన దేశంలో కూడా ఇవ్వడానికి అనుమతి లేదు, కాబట్టి కేవలం ఖుర్బానీ మినా లేదా మక్కా లోనే ఇవ్వాలి.

అబ్దుల్అజీం ఆబాది ఇలా చెప్పారు: మక్కాలోనీ హరం దగ్గర ఏ ప్రదేశంలోనైనా జంతు ఖుర్బానీ ఇవ్వవచ్చు. విద్వాంసుల దృష్టిలో మినాలో ఖుర్బానీ ఇవ్వడాన్ని ఉత్తమంగా పరిగణించారు.

ఖుర్‌బానీ ఇచ్చిన తర్వాత తల వెంట్రుకలను గొరిగించుకోండి లేదా (ఒకవేళ తలవెంట్రుకలు ఒక గణపు కంటే ఎక్కువగా ఉన్న పక్షంలో) వాటిని కత్తిరింపజేయండి. కానీ ఇంతకుముందు పేర్కొన్నట్లుగా వాటిని గొరిగించడమే ఉత్తమం. ఖుర్‌బానీ కొరకు మరొక వ్యక్తిని వకీలుగా సైతం చేయవచ్చు. కానీ తలవెంట్రుకలను గొరిగించడం లేదా కత్తిరించడం ఖుర్‌బానీ ఇచ్చిన తర్వాతే జరగాలి. కొంత మంది ఇస్లామీయ పండితులు ఖుర్‌బానీ ఇవ్వడానికి ముందు సైతం చేయవచ్చని పేర్కొన్నారు.

**ఇహ్‌రామ్ ముగింపు**

ఇప్పుడు మీరు హజ్ కొరకు కట్టుకున్న ఇహ్‌రామ్ కట్టుబాటు సైతం ముగిసిపోయింది. ఇక ఇప్పుడు మీరు కుట్టబడిన దుస్తులను ధరించవచ్చు. అలాగే భార్యతో లైంగికకార్యంలో పాల్గొనడం మినహా ఏయే పనులయితే ఇహ్‌రామ్ కారణంగా మీ కొరకు నిషిద్ధమయ్యాయో

వాటన్నింటినీ చేయవచ్చు.

ఈరోజే మీరు మక్కాకు వెళ్ళి తవాఫె జియారత్ చేయవలసి యుంటుంది. అందుకే మీరు ఖుర్బానీ ఇచ్చిన తర్వాత తలవెంట్రుకలను గొరిగించుకున్న పక్షంలో లేదా కత్తిరించుకున్న పక్షంలో స్నానం చేసి దుస్తులు మార్చుకొని లేదా ఇహ్రామ్ దుస్తులలోనే అదే స్థితిలో మక్కాకు వెళ్ళిపోండి. అక్కడికి చేరుకున్న తర్వాత ఇంతకుముందు మీరు ఏవిధంగానయితే తవాఫ్ చేసియున్నారో అదేవిధంగా తవాఫ్ చేయండి. అది తవాఫె జియారత్‌గా పేర్కొనబడుతుంది. ఆ తవాఫ్ చేసిన తర్వాత భార్యతో లైంగికకార్యంలో పాల్గొనడం సైతం ధర్మసమ్మతమయిపోతుంది మరియు ఇహ్రామ్ పూర్తిగా ముగిసిపోతుంది.

తవాఫ్ పూర్తయిన తర్వాత రెండు రకాతులు నమాజ్ చదవండి, ముల్‌తజిమ్ వద్దకు వెళ్ళి ప్రార్థించండి. ఆ తర్వాత హజ్రె అస్వద్‌ను చుంబించి సఫా మరియు మర్‌వహ్‌ల వద్ద సఈ చేసేందుకై బయలు దేరండి. ఏ విధంగానయితే మొదటిరోజు ఉమ్రహ్‌కు సంబంధించిన తవాఫ్ చేసిన తర్వాత ఉమ్‌రహ్‌కు సంబంధించిన సఈ చేశారో అదేవిధంగా ఈరోజు తవాఫె జియారత్ తర్వాత హజ్‌కు సంబంధించిన సఈ చేయండి.

సఈ చేసిన తర్వాత మస్జిదె హరామ్‌కు వచ్చి ముతాఫ్ లో ఒకవేళ హజ్రె అస్వద్ ముందు అవకాశం లభించిన పక్షంలో అక్కడ, లేకుంటే ఎక్కడ వీలయితే అక్కడ రెండు రకాతులు నఫిల్ నమాజ్ చదవండి. (ఈ తవాఫె జియారత్ మరియు ఆ తర్వాతి సఈ ను ఒకవేళ ఏదయినా కారణం చేత జిల్‌హజ్జహ్ మాసపు 10 వ తేదీన చేయలేని పక్షంలో జిల్‌హజ్జహ్ మాసపు 12వ తేదీన సూర్యాస్తమయ వేళకు ముందు వరకు చేయవచ్చు.

## తవాఫె జియారత్ తర్వాత మినాకు వెనుదిరిగి రావడం

నేడు మినా నుంచి మక్కాకు రావడమనేది ఈ తవాఫ్ మరియు సఈ ల కొరకు మాత్రమే జరుగుతుంది. ఈ పనులను ముగించిన తర్వాత తిరిగి మినాకు వెళ్ళవలసి యుంటుంది.

## హజ్ ఫర్జ్ విధులు (రుకున్/అర్కాన్)

1. నిర్ణీత (మీఖాత్) ప్రదేశం నుంచి ఇహ్రాం కట్టుకోవటం
2. మగ్రిబ్ వరకూ అరఫాత్ మైదానంలో ఆగటం
3. కాబా గృహ ప్రదక్షిణలు (తవాఫె జియారత్) చేయటం

పై విధులలో ఏ ఒక్క విధిని విడిచి పెట్టినా మళ్ళీ ఆ విధిని పూర్తి చేయనంత వరకూ హజ్‌యాత్ర నెరవేరదు.

### హజ్‌లో తప్పనిసరి(వాజిబ్) అంశాలు

1. ముజ్దలిఫా మైదానంలో రాత్రి బస చేసి, ఫజర్ నమాజ్ పూర్తి అయ్యేవరకు వేచి వుండటం
2. జమరాలపై కంకరాళ్ళు రువ్వటం
3. ఖుర్బానీ ఇవ్వడం,
4. తల వెంట్రుకల్ని తీసివేయటం.
5. సఫా మర్వాల మధ్య సయీ చేయడం
6. తీష్రీఖ్ దినాల రాత్రులు మీనా ప్రదేశంలో గడపటం
7. కాబా గృహానికి వీడ్కోలు ప్రదక్షిణలు (తవాఫె విదా) చేయటం

పై అంశాల్లో ఓ ఒక్క అంశాన్ని వదలి వేసినా 'బలి' (దమ్) తప్పకుండా ఇవ్వాలి.

# హజ్ ఎప్పుడు ఆరంభమైనది?

సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం హదీస్ గ్రంథాలలో నమోదు చేయబడిన ఇబ్నె ఉమర్ (రజి)మరియు ఇతరుల హదీసుల ఆధారంగా 'అల్లాహ్ పవిత్ర గృహానికి చేసే హజ్జ్ యాత్ర' ఇస్లాం యొక్క ఐదు మూలసిద్ధాంతాలలో ఒకటి.

ఇతర ఆరాధనలలో మాదిరిగా హజ్‌లో కూడా కొన్ని ప్రత్యేకమైన ఆచరణలు ఉన్నాయి. అల్లాహ్ నిర్దేశించిన విధంగానే వీటిని ఆచరించవలసి ఉంది. ఉదాహరణకు మీఖాత్ నుండి ఇహ్రామ్ స్థితిలోనికి ప్రవేశించటం, తవాఫ్(కాబా ప్రదక్షిణ), సఫా మరియు మర్వాల మధ్య సయీ చేయటం, అరఫా మైదానంలో నిలబడటం, ముజ్దలిఫా మైదానంలో రాత్రి గడపటం, జమరాత్‌లో రాళ్ళు విసరటం, పశుబలి(ఖుర్బానీ) చేయటం మొదలైనవి ప్రధానమైన హజ్జ్ ఆచరణలు. వీటన్నింటినీ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం బోధనల ప్రకారమే ఆచరించవలసి ఉన్నది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం యొక్క హజ్ యాత్రను వివరించే హదీసులు అనేకం ఉన్నాయి. 'జాద్అల్మాద్' అనే గ్రంథంలో ఇమాం ఇబ్నెఅలయ్యిమ్ మరియు 'అల్బిదాయహ్వల్నిహాయహ్' అనే గ్రంథంలో అల్హాఫిజ్ ఇబ్నెకథీర్ ఈ హదీస్‌లను సంకలనం చేసియున్నారు. అంతేకాక ఈ హదీసుల నుండి ఉద్భవించే హజ్ నియమ నిబంధనలను కూడా ఈ ఇద్దరు పండితులు వివరించినారు. ఈ నియమ నిబంధనలను నేర్చుకోవటంలో మరియు వాటిని ఆచరించటంలో ప్రతి ముస్లిం తప్పకుండా శ్రద్ధ చూపాలి.

అల్లాహ్ నామ స్మరణాన్ని, ధ్యానాన్ని స్థాపించటమే హజ్జ్ ఆచరణల యొక్క ప్రధాన ఉద్దేశ్యమని మనం గుర్తుంచుకోవాలి. దీని గురించి ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలుపుతున్నాడు.

(హజ్ కాలంలో) మీ ప్రభువు అనుగ్రహాలను (వ్యాపారం ద్వారా) అన్వేషిస్తే మీపై దోషమేమీ లేదు. అరఫా నుండి తరలిపోయినప్పుడు, 'మష్అరిల్హరాం'(ముజ్దలిఫా) వద్ద అల్లాహ్‌ను స్మరించండి. ఆయన మీకు నేర్పిన విధంగా ఆయనను స్మరించండి. నిశ్చయంగా, పూర్వం మీరు మార్గభ్రష్టులలోని వారిగా ఉండేవారు. ఆ తరువాత ప్రజలు ఎక్కడి నుండైతే తరలిపోతారో, అక్కడి నుండి మీరూ తరలిపొండి మరియు అల్లాహ్ యొక్క క్షమాభిక్షను వేడుకోండి. నిశ్చయంగా, అల్లాహ్ అమితంగా క్షమించేవాడూ, అపారకృపాశీలుడు. ఎప్పుడైతే మీరు మీ'మనాసిక్'లు పూర్తి చేసుకుంటారో, అల్లాహ్ ను స్మరించండి- మీరు మీ పూర్వీకులను స్మరించినట్లుగా లేదా అంతకన్నా అధికంగా స్మరించండి.

ప్రజలలో ఎవరైతే "ఓ మా ప్రభూ! మాకు ఈ లోకంలోనే ప్రసాదించు"అని అంటారో, వారికి పరలోకంలో ఎలాంటి భాగమూ ఉండదు. మరియు వారిలో మరికొందరు "ఓ మా ప్రభూ! మాకు ఇహలోకంలో మంచిని ప్రసాదించు మరియు పరలోకంలోనూ మంచిని ప్రసాదించు. మరియు మమ్మల్ని నరకాగ్ని శిక్ష నుండి కాపాడు." అని అంటారో,అటువంటి వారికే తాము సంపాదించుకున్న దాని నుండి భాగం ఉంటుంది. మరియు అల్లాహ్ లెక్క తీసుకోవటంలో అతిశీఘ్రుమైనవాడు. మరియు లెక్కించదగిన ఆ దినములలో అల్లాహ్‌ను స్మరించండి. ఎవరైతే రెండు రోజులలోనే వెళ్ళడానికి త్వరపడతారో, అతనిపై ఎటువంటి దోషమూ లేదు మరియు ఎవరైతే ఆలస్యం చేస్తారో, అతనిపై కూడా ఎటువంటి దోషమూ లేదు. ఇది భయభక్తులు కలవారి కొరకు. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి మరియు తెలుసుకోండి- మీరంతా ఆయన వైపునకే సమీకరించబడతారు. అల్ బఖరహ్ 2:198-203

ఒక హదీసులో ఆయెషా రజియల్లాహుఅన్హా ఇలా ఉల్లేఖించినారు: "కేవలం అల్లాహ్ నామస్మరణాన్ని స్థాపించటం కొరకే కాబా గృహం చుట్టూ తవాఫ్(ప్రదక్షిణం) చేయుటం, అస్సఫా మరియు అల్ మర్వాల మధ్య సయీ(తిరగటం), జమరాత్లో రాళ్ళు విసరటం మొదలైనవి నిర్దేశింపబడినవి."

హజ్జ్ ఆచరణలను గౌరవించమనే అల్లాహ్ ఆజ్ఞలను, ముస్లింలు మనస్ఫూర్తిగా పాటిస్తారు. దీని గురించి ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు: "అలాగే నిశ్చయంగా హృదయాలలో ఉన్న దైవభీతి వల్లనే అల్లాహ్ నియమించిన చిహ్నాలను గౌరవిస్తారు." అల్హజ్ 22:32

హజ్రె అస్వద్

బుఖారీ హదీసు గ్రంథంలోని ఒక హదీసులో ఇలా నమోదు చేయబడినది: ఉమర్ ఇబ్నెఖత్తాబ్ రజియల్లాహుఅన్హు దివ్యశిలను ముద్దాడి, దానితో ఇలా పలికినారు, "ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం నిన్ను ముద్దాడటాన్ని నేను గనుక చూసి ఉండకపోతే, నేను నిన్ను అస్సలు ముద్దు పెట్టుకునే వాడినే కాను." హజ్జ్ ఆచరణలను చర్చిస్తూ మరియు వివరిస్తూ ఇబ్నెఅల్జౌజీ ఇలా అన్నారు:

''ఈ ఆచరణల వెనుకనున్న చరిత్ర కనుమరుగయిపోయినది, కానీ వాటి నియమాలు మాత్రం అలాగే వాడుకలో నిలిచిపోయాయి. ఈ ఆచరణలు కొందరు దర్శకులను తికమకపెట్టవచ్చు. దీనికి కారణం వారికి ఆ ఆచరణల వెనుకనున్న కారణం తెలియకపోవటమే. అందువలన వారు హజ్‌లోని కొన్ని ఆచరణల గురించి' దీనిలో అర్థం పర్థం లేదు.'అని పలుకుతుంటారు. హదీసు ఉల్లేఖనలు లభ్యమైనంత వరకు వాటికి గల కారణాలను నేను వివరించాను. ఇప్పుడు వాటి సరైన అర్థాలను వివరిస్తాను.

సమర్థించుకోదగ్గ మరియు తేలికగా అర్థం చేసుకోదగ్గ సరైన కారణంపైనే ఆరాధనల యొక్క అసలు పునాది ఆధారపడి ఉంటుందనేది ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం. అదేమిటంటే, దాసుడు తన యజమానికి సమర్పించుకోవటం మరియు సంపూర్ణ విధేయత చూపటం. ఆతని ప్రార్థనలలో ఇబాదహ్(ఆరాధన) అనే పదం యొక్క భావాన్ని ప్రదర్శించే వినమ్రత, వినయం మరియు సంపూర్ణ సమర్పణ ఉంటుంది.

జకాహ్ దానం

జకాహ్ దానంలో(విధి దానంలో) బీదలపై చూపే దయ మరియు సహాయం ఇమిడి ఉన్నాయి. కాబట్టి దానర్థం తేటతెల్లంగా స్పష్టమవుతున్నది.

ఉపవాసం

ఉపవాసం అంటే తను దాస్యం చేయవలసిన ఆ ఏకైక ఆరాధ్యునికి మాత్రమే విధేయత చూపటానికి వీలుగా తన స్వంత కోరికలను, వాంఛలను, అభిలాషను, ఇచ్ఛను అణచి వేసుకోవటం.

కాబా గృహం

కాబాగృహాన్ని గౌరవించటం, దానిని దర్శించటం మరియు దాని చుట్టుప్రక్కల ప్రాంతాల పవిత్రతను స్థాపించటం మొదలైనవి ఉత్తమ ఆచరణలు. చిత్తశుద్ధితో పరిశుభ్రంగా అక్కడకు చేరటమనేది ఒక దాసుడు సంపూర్ణ వినయవిధేయతలతో, వినమ్రతగా, అణుకువగా, నిరాడంబరంగా, నిగర్వంగా తన ప్రభువు వైపు మరలటాన్ని స్పష్టం చేస్తుంది. తను అర్థం చేసుకున్న మరియు తనను ప్రేరేపించిన ఆరాధనలను మానవుడు సునాయాసంగా ఆచరిస్తాడు.

కాని పరిపూర్ణ సమర్పణ సాధించటం కొరకు మనం అర్థం చేసుకోలేని కొన్ని ఆరాధనలు పాటించవలసి ఉంటుంది. వాటి ఆచరణ మానవుడికి అంత సులభతరం కాకపోవచ్చు మరియు వాటిని అతను గ్రహించలేకపోవచ్చు. ఈ పరిస్థితిలో అల్లాహ్ ఆజ్ఞలకు విధేయత చూపటమనేది మాత్రమే మనల్ని అటువంటి ఆరాధనలు చేయుటానికి ప్రేరేపిస్తుంది. ఇది అత్యుత్తమమైన వినమ్రత, అణుకువ మరియు సమర్పణ

విధానం.'' మరిన్ని వివరాలకు'ముథీర్‌అల్‌అజమ్‌అల్సాకిన్ **(1.285-286)**'చూడండి.

హజ్ ఆచరణలు

ఇది అర్థం అయినట్లయితే, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం కంటే పూర్వపు హజ్ ఆచారాల చరిత్ర గురించి మనకు ఎక్కువగా తెలియదనే విషయంలో అంత ప్రాధాన్యత లేదనేది మనం అర్థం చేసుకోగలం. కొన్ని హజ్ ఆచరణల గురించి వివిధ గ్రంథాలలో తెలుపబడిన కొన్ని ఉల్లేఖనలను క్రింద తెలుపుచున్నాము:

హజ్ ఎప్పుడు విధిగా చేయబడినది? హజ్ ఎప్పుడు ఆరంభమైనది?

అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు : "మరియు ప్రజలకు హజ్ యాత్రను గురించి ప్రకటించు: వారు పాదాచారులుగా మరియు ప్రతి బలహీనమైన ఒంటె(సవారీ) మీద, విశాల(దూర) ప్రాంతాల నుండి మరియు కనుమల నుండి నీ వైపుకు వస్తారు.'' అల్హజ్జ్ 22:27

పవిత్ర యాత్ర

ఇబ్నెకసీర్ ఈ వచనాన్నివివరిస్తూ ఇలా తెలిపినారు**(3/221)**:

దీని అర్థం ఏమిటంటే: " '(ఓ ఇబ్రాహీం) ప్రజలకు హజ్ గురించి ప్రకటన చేయి, మేము నిన్ను ఆజ్ఞాపించి నిర్మింపజేసిన ఈ గృహం వైపునకు పవిత్ర యాత్ర చేయమని ప్రజలకు పిలుపు నివ్వు.'అనే అల్లాహ్ ఆదేశం విని, ఇబ్రాహీం అలైహిస్సలాం ఇలా అంటారు 'ఓ ప్రభు!నా పిలుపు అంత బిగ్గరగా లేదే. మరి అది ప్రజలకు ఎలా చేరగలదు?' అల్లాహ్ ఇలా పలుకుతాడు "ప్రకటించు మరియు మేము దానిని ప్రజలకు చేర్చుతాము.'' అప్పుడు ఆయన తన స్థానంలో నిలుచుని లేదా ఒక గుట్టపై నిలుచుని లేదా అస్సఫా అనే చిన్న కొండపై నిలుచుని లేదా కాబాకు అతి దగ్గరలోనున్న అబుఖుబైస్ అనే ఎత్తైన పర్వతంపై నిలుచుని గొంతెత్తి ఇలా ప్రకటించినాడు: "ఓ ప్రజలారా, మీ ప్రభువు ఒక గృహాన్ని ఎన్నుకున్నాడు, కాబట్టి దానిని దర్శించటానికై రండి.''

అప్పుడు అతని పిలుపును భూమిపై ఉన్న అన్ని ప్రాంతాలకు చేరుకోవటానికి వీలుగా పర్వతాలు క్రిందకు వంగినాయి. ఆ పిలుపును ఆ సమయంలో భూమిపై ప్రాణంతో ఉన్న మానవులందరూ వినటమే కాక, ఇంకా జన్మించని తల్లి గర్భంలోని శిశువులు మరియు పురుషుని నడుములోని వీర్యబిందువులు కూడా విన్నాయని తెలుపబడినది. అతని పిలుపు విన్న మరియు అల్లాహ్ ఎన్నుకున్న ప్రతి ఒక్కరూ వారు ఏ ప్రాంతంలో నివసిస్తున్నా, ఏ పట్టణంలో నివసిస్తున్నా, చెట్లనీడలలో లేదా గుడారాలలో నివసించే దేశదిమ్మరులైనా 'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ (హాజరయ్యాను, ఓ అల్లాహ్, హాజరయ్యాను)'అని పలుకుతూ ప్రళయ దినం వరకు తప్పక హజ్ యాత్ర చేయవలెను.''ఇబ్నెఅబ్బాస్, ముజాహిద్, ఇక్రిమాహ్, సయీద్ఇబ్నెజుబైర్ మరియు ఇతర ముందుతరం పండిత ముస్లిం ఉల్లేఖనల యొక్క సారాంశమిది. మరియు అసలు విషయం అల్లాహ్ కే తెలుసు.

హజ్ మాసం

ఇబ్నెఅల్జౌజీ తన పుస్తకం 'ముథీర్ అల్ అజమ్ అల్సాకిన్**(1/354)**'లో పైన తెలిపిన విషయాలనే చాలా క్లుప్తంగా ఉల్లేఖించి, వాటిని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం చరిత్ర(సీరత్) తెలిపిన ఉల్లేఖకులవిగా నమోదు చేసినారు.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లంను ఈ భూమిపై పంపక ముందు హజ్ విధిగావించటం గురించిన చరిత్రకు సంబంధించిన విషయమిది. అయితే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం కాలంలో హజ్ విధిగావింపబడిన సంవత్సరం గురించి పండితులలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. కొందరు పండితులు **6**వ హిజ్రీ సంవత్సరంలో అని, కొందరు, **7**వ హిజ్రీ సంవత్సరంలో అని, కొందరు **9**వ హిజ్రీ సంవత్సరంలో అని, మరికొందరు **10**వ హిజ్రీ సంవత్సరంలో అని

అంటారు. అయితే ఖచ్చితంగా '9వ లేదా10వ సంవత్సరంలో హజ్ విధిగావింపబడినది 'అని ఇమాం ఇబ్నె అలయ్యిమ్ అభిప్రాయపడుతున్నారు. తన 'జాద్అల్మఆద్' అనే పుస్తకంలో ఆయన ఇలా తెలిపినారు:

"ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం మదీనాకు వలస వెళ్ళిన తరువాత, 'వీడుకోలు హజ్'గా ప్రఖ్యాతి చెందిన హజ్ తప్ప ఇంకే హజ్ యాత్రా చేయలేదు మరియు అది 10వ హిజ్రీ సంవత్సరంలో జరిగినది అనే విషయంలో పండితుల మధ్య ఎలాంటి భేదాభిప్రాయం లేదు. హజ్ ఆదేశం అవతరించిన తరువాత, ఎలాంటి ఆలస్యం చేయకుండా హజ్ చేయటానికి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం త్వరపడినారు. అయితే హజ్ ఆదేశం ఆయన చివరి దశలో అంటే 9 లేదా 10వ హిజ్రీ సంవత్సరంలో అవతరించినది. మరి అటువంటప్పుడు, ఆ ఆదేశం ముందుగానే అవతరించినా, దాని ఆచరణ మాత్రం9 లేదా10వ హిజ్రీ సంవత్సరం వరకు వాయిదా వేయబడినదని ఎవరైనా ఎలా నిరూపించగలరు? ఖుర్ఆన్ లోని మూడవ అధ్యాయమైన సూరహ్ ఆలె ఇమ్రాన్ యొక్క మొదటి భాగం రాయబార బృందాల(ఆమ్అల్ఉఫూద్) సంవత్సరంలో అవతరించినదని తెలుపుతున్నాము.

జిజియా పన్ను

ఆ సంవత్సరంలో నజరా ప్రాంతం నుండి ఒక రాయబార బృందం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం వద్దకు వచ్చినది.

వారు జిజియా పన్ను చెల్లించే విధంగా ఆయన వారితో ఒడంబడిక చేసుకున్నారు మరియు జిజియా పన్నుగురించిన ఆదేశాలు తబూకు యుద్ధం జరిగిన 9వ హిజ్రీ సంవత్సరంలో సూరహ్ ఆలె ఇమ్రాన్ మొదటిభాగం అవతరించినప్పుడు అవతరించినవి."

జాద్అల్మఆద్(3/595)లో ఇలా తెలుపబడినది- ఖుర్ఆన్ (3:97)

సూరహ్ ఆలె ఇమ్రాన్ లోని 97వ వచనంలో హజ్ విధిగావించపబడిన ఆదేశం ఇలా ఉన్నది : "మరియు అక్కడికి పోవటానికి, శక్తిగలవారికి ఆ గృహయాత్ర అల్లాహ్ కొరకు చేయటం విధిగావింపబడినది.''హజ్ యాత్ర విధిగావించబడినదనే ఆజ్ఞను ఈ వచనం తెలుపుతున్నది.

ఇది 9వ సంవత్సరం చివరి భాగంలో రాయబారబృందాల సంవత్సరంలో అవతరించినది. కాబట్టి హిజ్రీ 9వ సంవత్సరం చివరిలో హజ్ యాత్ర విధిగావించబడినది.

ప్రజలపై హజ్ విధిగావించబడినది

తన తఫ్సీర్లో(ఖుర్ఆన్ వివరణ గ్రంథం, 2/4/92భాగంలో) అలుర్తుబి ఇలా తెలిపినారు: హజ్ గురించి అరబ్బు ప్రజలకు ముందు నుండీ తెలుసు. ఇస్లాం వచ్చిన తరువాత, వారికి ముందు నుండీ తెలిసియున్న'ప్రజలపై హజ్ విధిగావించబడినదే' అనే విషయమే మరల వారికి తెలుపబడినది.'' మరిన్ని వివరాలకు ఇబ్నెఅలుర్తుబి రచించిన 'అల్అహ్కామ్అలుర్ఆన్', 1/286చదవండి.

కాబా గృహం చుట్టూ తవాఫ్ (ఏడు సార్లు ప్రదక్షిణ) చేయటం:

అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు: "ఇబ్రాహీము మరియు ఇస్మాయీలులను ఇలా ఆదేశించాము "నా గృహాన్ని పరిశుద్ధపరచండి. దాని ప్రదక్షిణలు చేసేవారి కొరకు, ఏతేకాఫ్ పాటించేవారి కొరకు (ప్రార్థనలు మరియు ఆరాధనల నిమిత్తం తమను తాము ఏకాంతపరచుకునే వారి కొరకు), ఇంకా రుకూ- సజ్దాలు చేసేవారి కొరకు."" అల్ బఖరహ్ 2:125

కాబా గృహం చుట్టూ చేసే తవాఫ్- ప్రవక్త ఇబ్రాహీమ్ అలైహిస్సలాం కాలంలో తెలిసిన విషయమేనని ఈ వచనం సూచిస్తున్నది.

రమల్

రమల్ అంటే దగ్గర దగ్గరగా అడుగులు వేస్తూ, త్వరత్వరగా, వడివడిగా నడిచే నడక. తవాఫ్ అలుదూమ్(ఆగమ తవాఫ్- మక్కా చేరగానే ప్రారంభంలో చేసేది) లో ఇది పురుషుల కొరకు సున్నత్(ఉత్తమం), కానీ స్త్రీలకు కాదు.

రమల్ ఎలా ప్రారంభమైనది

బుఖారీ హదీస్ గ్రంథంలో**(2/469-470, 1602)** మరియు ముస్లిం హదీస్ గ్రంథంలో **(2/991-992, 1262)** ఇబ్నె ఉమర్ రజియల్లాహుఅన్హు ఉల్లేఖించిన హదీసులు ఇలా నమోదు చేయబడినాయి: ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం తన సహచరులతో రాగా, ''యత్రిబ్ (మదీనా నగరం) జ్వరంతో బలహీన పడిపోయిన ప్రజలు వచ్చారు చూడండి.''అని ముష్రికులు (కాబా వద్దనున్న బహుదైవారాధకులు) అన్నారు. అప్పుడు ప్రవక్త సల్లల్లాహుఅలైహివసల్లం తవాఫ్‌లోని మొదటి మూడు ప్రదక్షిణలలో వడివడిగా నడవమని (రమల్ చేయమని) ఆదేశించినారు. ఇంకో ఉల్లేఖనంలో ఆయన ఇలా ఆదేశించారని నమోదు చేయబడినది, "మీ బలాన్ని ముష్రికులు చూసే (తెలుసుకునే) విధంగా వడివడిగా నడవండి.''

జమ్ జమ్ పవిత్ర జలం మరియు అస్సఫా మరియు అల్ మర్వాల మధ్య చేసే సయీ నడక.

ఇబ్నెఅబ్బాస్ రజియల్లాహుఅన్హు ఉల్లేఖించిన హదీసు సహీహ్ బుఖారీలో ఇలా నమోదు చేయబడినది:

కాబా మస్జిద్ వద్ద నేటి జమ్ జమ్ బావి సమీపంలోని ఎత్తైన ప్రాంతంలో ఉన్న ఒక చెట్టు క్రింద ఇబ్రాహీమ్ అలైహిస్సలాం తన భార్య హాజిరాను మరియు ఆవిడ కుమారుడు ఇస్మాయీలును తీసుకువచ్చినారు. అప్పుడు ఇస్మాయీలు ఇంకా తల్లి పాలు త్రాగే పసికందు వయస్సులో ఉన్నారు. ఆ రోజులలో మక్కాలో నివసించే వారు కాదు మరియు అక్కడ నీరు కూడా లేకుండెను.

ఒక తోలు సంచిలో కొన్ని ఖర్జురపు పళ్ళు మరియు ఒక తోలు సంచిలో కొంత నీరు వారికిచ్చి, అక్కడ వారిని వదిలిపెట్టి, ఆయన తిరుగు ప్రయాణం మొదలుపెట్టినారు. ఇస్మాయీలు తల్లి ఆయన వెంటబడి, ఇలా పలికినది, "ఓ ఇబ్రాహీమ్! ఏ మానవుడూ, ఏ వస్తువూ లేని ఈ లోయలో మమ్మల్ని వదిలి, నీవెక్కడికి వెళుతున్నావు?'' ఇలా ఆవిడ అనేక సార్లు ఆయనను ప్రశ్నించినది. కానీ, ఆయన ఆవిడ వైపు అస్సలు చూడలేదు. ఇక చివరగా ఆవిడ ప్రవక్త ఇబ్రాహీమ్ అలైహిస్సలామును ఇలా ప్రశ్నించినది, "ఇలా చేయమని అల్లాహ్ నిన్ను ఆజ్ఞాపించినాడా?'' దానికి ఆయన, "అవును.''అని జవాబిచ్చినారు. అప్పుడు ఆవిడ, "అలా అయితే, అల్లాహ్ మమ్మల్ని(కాపాడకుండా) వదిలివేయడు,''అని పలికి, వెనుదిరిగినది. ప్రవక్త ఇబ్రాహీమ్ అలైహిస్సలాం ముందుకు ప్రయాణం సాగించినారు. వారు కనిపించనంత దూరంలో ఉన్న అల్థానియహ్ అనే ప్రాంతానికి చేరుకున్న తరువాత ఆయన కాబా వైపునకు తిరిగి, రెండు చేతులెత్తి, దీనంగా అల్లాహ్‌తో ఇలా వేడుకున్నాడు:

"ఓ మా ప్రభూ! వాస్తవానికి నేను నా సంతానంలో కొందరిని నీ పవిత్ర కాబా గృహం దగ్గర పైరుపండని, ఎండిపోయిన కొండలోయలో నివసింపజేశాను. ఓ మా ప్రభూ!వారిని అక్కడ నమాజు స్థాపించటానికి ఉంచాను. కనుక నీవు ప్రజల హృదయాలను, వారివైపుకు ఆకర్షింపజేయి మరియు వారు కృతజ్ఞులై ఉండటానికి వారికి జీవనోపాధిగా ఫలాలను సమకూర్చుము..'' ఇబ్రాహీమ్**14:37**

ఇస్మాయిలు తల్లి ఇస్మాయిలుకు పాలుపడుతూ, తానేమో తన వద్దనున్ననీరు త్రాగుతూ ఉండినది. కొన్నాళ్ళలోనే తోలుసంచిలోని నీరు మొత్తం ఖర్చయిపోయినవి. అప్పుడు ఆవిడకు మరియు ఆవిడ బిడ్డకూ దాహం వేయగా, ఆవిడ తన బిడ్డవైపు దీనంగా చూడసాగినది. ఇక బిడ్డ పరిస్థితి చూడలేక, అతడిని అక్కడే నేలపై పడుకోబెట్టి, దగ్గరలోని అస్సఫా కొండపైకి ఎక్కి, ఎవరైనా కనబడతారేమోనని లోయవైపునకు చూడసాగినది. కానీ, ఆవిడకు ఎవరూ కనబడలేదు.

అప్పుడు అస్సఫా కొండ దిగి, లోయలోనికి వచ్చి, ఆపదలో మరియు కష్టంలో ఉన్న వ్యక్తివలే పరుగెత్తుతూ, లోయదాటి, అల్ మర్వా కొండపైకెక్కి, నలుదిక్కులా ఎవరైనా కనబడతారేమోనని చూడసాగింది. కానీ ఆవిడకు అక్కడ కూడా ఎవరూ కనబడలేదు. అలా ఆవిడ ఏడు సార్లు తిరిగినది(అస్సఫా మరియు అల్ మర్వాకొండల

**ఆ దైవదూత ఆవిడతో ఇలా అన్నాడు, 'నిర్లక్ష్యంగా వదిలివేయబడతానేమోనని భయపడకు. ఎందుకంటే ఈ బాలుడు మరియు అతడి తండ్రిచే నిర్మింపబడే అల్లాహ్ యొక్క గృహం ఇది. మరియు అల్లాహ్ తన ప్రజలను ఎన్నడూ నిర్లక్ష్యం చెయ్యడు.**

మధ్య ఏడు సార్లు పరుగెత్తినది).

ఇబ్నె అబ్బాస్ రజియల్లాహుఅన్హు ఇలా అన్నారు: ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం ఇలా తెలిపినారు, "ఇదియే వాటి మధ్య (అస్సఫా మరియు అల్ మర్వా కొండల మధ్య) ప్రజల సయా (నడకకు ఆరంభం)." ఆవిడ చివరిసారిగా (ఏడవసారి) అల్ మర్వా పైకి చేరగానే, ఒక దివ్యవాణి విన్నది. తనకు తానే "ష్..ష్!" అనుకుంటూ, ఏకాగ్రతతో దానిని ఆలకించటానికి ప్రయత్నించినది. ఆవిడకు మరల ఆ శబ్దం వినబడగానే, ఆ శబ్దం వచ్చిన దిశవైపునకు తిరిగి ఆవిడ ఇలా అన్నది, "ఓ, (నీవెవరివయినాగానీ)! నీవు నీ శబ్దాన్ని నాకు వినిపించావు నాకు సహాయం చేసేదేమైనా నీ వద్ద ఉన్నదా?" అప్పుడు ఒక దైవదూత జమ్ జమ్ స్థలంలో నీటిధార ఉబికివచ్చే వరకు తన మడమతో(లేదా తన రెక్కతో) త్రవ్వటాన్ని ఆవిడ చూసినది. వెంటనే ఆవిడ ఆ నీటిధార చుట్టూ తన చేతులతో అడ్డుకట్ట కట్టి, తోలుసంచిని నింపుకోవటం మొదలుపెట్టినది. ఆవిడ కొంత నీటిని నింపుకున్న తరువాత, ఆ ధార ఇంకా ముందుకు ప్రవహించసాగినది.

ఇబ్నెఅబ్బాస్ ఇలా అన్నారు: ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం ఇలా తెలిపారు, "ఇస్మాయీలు తల్లిపై అల్లాహ్ అనుగ్రహం చూపు గాక! ఒకవేళ ఆవిడ జంజం నీటిధారను ఆపటానికి ప్రయత్నించకుండా అలాగే వదిలి వేసినట్లయితే(ఆ నీటిని తన తోలుసంచిలో నింపుకోనట్లయితే), అది భూమి ఉపరితలంపై ఒక నదివలే ప్రవహించి ఉండేది." ఆయన మరల ఇలా పలికారు: "ఆ దైవదూత ఆవిడతో ఇలా అన్నాడు, 'నిర్లక్ష్యంగా వదిలివేయబడతానేమోనని భయపడకు. ఎందుకంటే ఈ బాలుడు మరియు అతడి తండ్రిచే నిర్మింపబడే అల్లాహ్ యొక్క గృహం ఇది. మరియు అల్లాహ్ తన ప్రజలను ఎన్నడూ నిర్లక్ష్యం చెయ్యడు'"

ఇబ్నెఅల్జౌజీ తన పుస్తకం అల్అజవ్ అల్సాకిన్(2/47)లో ఇలా తెలిపినారు: "ఇది ఎందుకు జమ్జమ్ అని పిలవబడుతున్నదనే కారణాన్నిఈ హదీసు వివరిస్తున్నది. ఎందుకంటే నీటి ధార ప్రవహించటం మొదలుపెట్టగానే, హాజిరా దానిని నియంత్రించడానికి (అరబీలోజమ్మత్-గా) ప్రయత్నించినది. భాషా పండితుడైన ఇబ్నె ఫారిస్ ఇలా తెలిపినారు: జమమ్తుఅల్నాఖహ్ (నేను ఒంటెకు కళ్ళెం, పగ్గం వేశాను) అనే పదాల నుండి జమ్జమ్ వచ్చును.

అరఫహ్ మైదానంలో నిలబడటం

యజీద్ ఇబ్నె షైబాన్ ఉల్లేఖనను అబూదావూద్ మరియు అత్తిర్మిజీ హదీసు గ్రంథాలు ఇలా నమోదు చేసాయి: అరఫ మైదానంలోని మౌఖిఫ్ (ఎక్కడైతే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం నిలబడిన చోటు) అనే స్థలానికి దూరంగా మేము నిలబడి ఉండగా, ఇబ్నెమిర్బాఅల్ అన్సారీ మా వద్దకు వచ్చి, ఇలా పలికినారు, "నేను ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం యొక్క వార్తా హరుడిని. ఆయన మీకు ఇలా తెలుపమన్నారు:

'మీరున్న చోటునే నిలబడండి. (ఇది కూడా నిలబడే స్థలమే), ఇక్కడనే మీ పితామహుడైన ఇబ్రాహీమ్ నిలబడినారు.'" తన సహీహ్ అబి దావూద్లో అల్బానీ దీనిని సహీహ్ హదీసుగా వర్గీకరించినారు.

హజ్ యొక్క అనేక ఆచరణలు ప్రవక్త ఇబ్రాహీమ్ అలైహిస్సలాం కాలంలో బోధించబడినవే. కానీ, మక్కా ముష్రికులు(బహుదైవారాధకులు) నిర్దేశింపబడని కొన్ని నూతన కల్పితాచారాలను హజ్ యాత్రకు జతపరచినారు. ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం ప్రవక్తగా పంపబడిన తరువాత, ఆయన వాటిని ఖండించి, అల్లాహ్ నిర్దేశించిన హజ్ ఆచరణలను వాటి అసలు రూపంలో మరల బోధించినారు.

# పవిత్ర ఖురాన్ సూచనలు

-డా.ఫజులుల్లా ఖాన్

అల్లాహ్ ద్వారా మానవాళి కొరకు అవతరింపజేయబడిన ఓ దివ్య గ్రంథం ఖురాన్.

ఈ గ్రంథంలో ఒక మనిషికి కావాలసిన అన్ని అంశాలు చెప్పబడ్డాయి. అసలు ఎవరిని ఆరాధించాలి. అల్లాహ్‌నే ఎందుకు ఆరాధించాలి, ఎవరిని వివాహమాడాలి, ఎవర్ని వివాహమాడకూడదు, తల్లిదండ్రులను ఎలా గౌరవించాలి, పురుషుని బాధ్యతలు ఏమిటి, స్త్రీల పట్ల ఎలా వ్యవహరించాలి, బంధువుల పట్ల ఎలా మెలగాలి, అనాధల పట్ల ఎలా మెలగాలి, ఆర్థికపర మైన లావాదేవీలు, యుద్ధరంగంలోను వ్యవహరించవలసిన నియమ నిబంధనలు, మానవతా ధర్మాలు ఇలాంటి మరెన్నో విషయాలు ఇందులో ఉన్నాయి.

మనిషి పుట్టుక ఆధారంగా ఏర్పడిన ఆధిక్యత నుంచి విముక్తి కలిగించింది ఖురాన్. సర్వ సమానత్వాన్ని బోధించింది. ప్రజల్ని పీడించే ప్రభుత్వం, వివేక రహితమైన శాసనం, ఆధిక్యతతో అధికారం చెలాయించే దుర్మార్గులు, వ్యాధిబాధలు, వృద్ధాప్యం, మరణం, దారిద్ర్యం, అవమానం, ప్రలోభం ఇటువంటి వాటిలో దేనిని చూసి భయపడకు అని మనిషిని శక్తిమంతునిగా, వీర పురుషునిగా తీర్చిదిద్ది అతను దృఢచిత్తంతో నిలబడగల మార్పు తీసుకొస్తోంది ఈ దివ్య ఖురాన్.

సాటి మనిషి పట్ల అధికారదర్ప ప్రదర్శన, మానవుని తెలివి తేటలను అణిచి వెయ్యగల ఆధిక్యత, భావ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛాయుత ఆలోచనల్ని నాశనం చేసే మానవ కట్టుబాట్లను ఖురాన్ తుడిచి వేసింది. మానవులందరూ సమానమే అనే ఏక దృష్టితో, సమ దృష్టితో చూడాలంటోంది ఖురాన్. మానవ జాతి అంతా ఒక్కటే అనీ, కుటుంబాలూ, కులాలు, తెగలూ అన్నీ పరస్పరం పరిచయ సాధనాలే అని ఖురాన్ స్పష్టం చేస్తోంది.

నీతిని, న్యాయాన్ని ఏ కారణం చేత ఎటువంటి పరిస్థితుల్లోనూ విడిచి పెట్టరాదని ఖురాన్ చెబుతోంది. మనిషి తోటి మనిషికి తలవంచనక్కరలేదు, మోకరిల్లి న్యూనత పడనవసరం లేదు, వంగి వంగి నమస్కారాలు చేయనవసరం లేదు అని ప్రభోధించి వ్యక్తి గౌరవానికి, మానవునిలో స్వతంత్రతా భావబీజాలు నాటి కొత్త బాట వేసింది ఖురాన్. మానవ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సామాజిక సమానత్వపు చైతన్యం, నీతిమంతమైన ఆలోచనలు గల అపూర్వ పునాదుల్ని పరిపూర్ణంగా వివరించి వాటి ఆధారంగా మానవ సమాజాన్ని నిర్మించింది ఖురాన్. అల్లాహ్ ఒక్కనికే తలవంచి నమస్కారం చేయాలని ఆదేశించింది ఖురాన్.

ఇది దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై దాదాపు 23 సంవత్సరాలలో (13 సం. మక్కాలో మరియు 10 సం. మదీనాలో) అవతరింపబడింది. ప్రపంచంలో అత్యధికంగా పఠించబడే గ్రంథం ఇదే. ఇందులో రెండు లోకాల (ఇహలోకం, పరలోకం)కు చెందిన సాఫల్య సూత్రాలు ఉన్నాయి. ఇందులో ప్రతి విషయం క్షుణంగా అర్థమయ్యేలా ఉంది. ఇందులో ఒక సంఘటన మరో సంఘటనతో ముడిపడి ఉంటుంది. ఇందులో ప్రతి చిన్న, పెద్ద విషయాలు క్షుణంగా ప్రస్తావించబడ్డాయి.

ఖురాన్ అల్లాహ్ పంపిన గ్రంథాలలో చిట్టచివరి గ్రంథం. ఇది కేవలం ముస్లింల కొరకు మాత్రమే అవతరించిన గ్రంథం కాదు. మొత్తం మానవజాతి మార్గదర్శకత్వం కోసం అవతరించిన గ్రంథం. మానవుడు తన జీవిత కర్తవ్యాన్ని బాధ్యతలని నెరవేర్చి, పరిపూర్ణ జీవితాన్ని తృప్తిగా జీవించాలి అని ఖచ్చితంగా చెప్పిన గ్రంథం ఖురాన్ ఒక్కటే. జీవితం నుంచి భయపడి పిరికితనంతో పారిపొమ్మని ఎక్కడా చెప్పలేదు. పలాయన వాదాన్ని సమర్థించలేదు, పూర్తిగా సంతృప్తిగా సంపూర్ణంగా జీవితాన్ని జీవించు అని నిర్దేశించి చెప్పింది ఖురాన్.

1. సత్యాన్ని అసత్యంతో కలిపి కలగాపులగం చేయకండి. తెలిసి కూడా సత్యాన్ని కప్పిపుచ్చకండి. (ఖుర్ఆన్2:42)
2. ప్రజలకైతే మీరు మంచిని గురించి ఆదేశిస్తారు, కాని మీ స్వయాన్ని మరచిపోతారే?! చూడబోతే మీరు గ్రంథపారాయణం చేస్తారాయె. మరి ఆ మాత్రం ఇంగిత జ్ఞానం కూడా మీకు లేదా? (ఖుర్ఆన్2:44)
3. భువిలో అలజడిని రేపుతూ తిరగకండి. (ఖుర్ఆన్2:60)
4. మానవులను మస్జిదులకు వెళ్ళకుండా ఆపకండి. (ఖుర్ఆన్2:114)
5. గుడ్డిగా ఎవరినీ అనుసరించకండి. (ఖుర్ఆన్2:170)
6. ఇచ్చిన మాటపై నిలబడండి. (ఖుర్ఆన్2:177)
7. లంచగొండితనానికి పాల్పడకండి. (ఖుర్ఆన్2:188)
8. మీతో పోరాడే వారితో మీరు కూడా దైవమార్గంలో పోరాడండి. (ఖుర్ఆన్2:190)
9. యుద్ధ నియమాలను పాటించండి. (ఖుర్ఆన్2:191)
10. అనాథలను రక్షించండి. (ఖుర్ఆన్2:220)
11. ఆశుద్ధావస్థలో భార్యలతో సమాగమం జరపకండి. (ఖుర్ఆన్ 2:222)
12. తల్లులు తమ పిల్లలకు పూర్తిగా రెండు సంవత్సరాల పాటు పాలు పట్టాలి.(ఖుర్ఆన్2:233)
13. రాజ్యాధికారానికి దాని అర్హతగలవాడిని ఎన్నుకోండి. (ఖుర్ఆన్2:247)
14. ధర్మం విషయంలో బలవంతం ఏమీ లేదు. (ఖుర్ఆన్2:256)
15. దానధర్మాలు చేసిన వారిపై తమ ఉపకారాన్ని చాటుకుని దాన్నివృధాచేసుకోకండి. (ఖుర్ఆన్2:264)
16. దైవమార్గంలో నిమగ్నులైన కారణంగా, (బ్రతుకు తెరువు కోసం) భూమిలో సంచరించే వీలులేని నిరుపేదలకు సహాయపడండి. (ఖుర్ఆన్2:273)
17. వడ్డీ సొమ్ము తినకండి. (ఖుర్ఆన్2:275)
18. ఒకవేళ రుణగ్రస్తుడు యిబ్బందుల్లో ఉంటే అతని పరిస్థితి మెరుగుపడేవరకూ అతనికి గడువు ఇవ్వాలి. (ఖుర్ఆన్2:280)
19. అప్పు వ్యవహారం చేసుకుంటున్నప్పుడుదాన్ని (స్పష్టంగా) వ్రాసుకోండి.(ఖుర్ఆన్2:282)
20. నమ్మకాన్నివమ్ము చేయకండి. (ఖుర్ఆన్2:283)
21. ఇతరుల మాటలు గోడచాటుగా వినకండి, చాడీలు చెప్పకండి. (ఖుర్ఆన్2:283)
22. దైవప్రవక్తలందరినీ విశ్వసించాలి. (ఖుర్ఆన్2:285)
23. ఎవరిపైన కూడా అతని సామర్ధ్యానికి మించి భారం వేయకండి. (ఖుర్ఆన్2:286)
24. పరస్పరం చీలిపోకండి. (ఖుర్ఆన్3:103)
25. కోపాన్ని అణచుకోండి. (ఖుర్ఆన్3:134)
26. మొరటుగా మాట్లాడకండి. (ఖుర్ఆన్3:159)
27. భూమ్యాకాశాల సృష్టి గురించి దీర్ఘంగా యోచన చేయండి. (ఖుర్ఆన్3:191)
28. పురుషులైనా, స్త్రీలైనా తమ కార్యాలకు అనుగుణంగా ప్రతిఫలం పొందుతారు. (ఖుర్ఆన్3:195)

29. చనిపోయిన వారి ఆస్తిని అతని కుటుంబీకుల మధ్య పంచిపెట్టాలి. (ఖుర్ఆన్4:7)

30. ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం ఉంది. (ఖుర్ఆన్4:7)

31. అనాథల సొమ్మును కాజేయకండి. (ఖుర్ఆన్4:10)

32. మీ కొరకు నిషేధించబడినవారు-మీ తల్లులు, మీ కుమార్తెలు, మీ అక్కా చెల్లెళ్ళు, మీ మేనత్తలు, మీ తల్లి సోదరీమణులు (మీ పిన్నమ్మ, పెద్దమ్మలు), మీ అన్నదమ్ముల కుమార్తెలు, అక్కా చెల్లెళ్ళకూతుళ్ళు (మేనకోడళ్ళు), మీకు పాలిచ్చిన తల్లులు, పాల వరుస ద్వారా మీకు అక్కాచెల్లెళ్ళు అయిన వారు, మీ భార్యల తల్లులు(అత్తలు), మీరు దాంపత్య సుఖాన్ని అనుభవించిన మీ భార్యల (ఆమె మాజీ భర్త ద్వారా పుట్టిన) మీ సంరక్షణలో వున్న కూతుళ్ళు - ఒకవేళ మీరు వారితో సమాగమం జరపకుండా ఉంటే (కేవలం పెళ్ళిమాత్రం చేసుకుని వారికి విడాకులు యిచ్చేసివున్న పక్షంలో వారి కూతుళ్లను వివాహమాడటం) మీ కొరకు పాపం కాదు. అలాగే మీ వెన్ను నుండి (స్ఖలించబడిన వీర్యంతో) పుట్టిన మీ కొడుకుల భార్యలు (కోడళ్ళు) మీ కోసం నిషేధించబడ్డారు. (ఏకకాలంలో) ఇద్దరు అక్కా చెల్లెళ్ళను కలిపి భార్యలుగా చేసుకోవటం కూడా మీ కొరకు నిషిద్ధమే, లోగడ జరిగిందేదో జరిగిపోయింది. నిస్సందేహంగా అల్లాహ్ క్షమాశీలి, కృపాకరుడు కూడాను. (ఖుర్ఆన్4:23)

33. ఇతరుల ధనాన్ని అన్యాయంగా కాజేయకండి. (ఖుర్ఆన్4:29)

34. మగవాడు కుటుంబాన్ని పోషించాలి. (ఖుర్ఆన్4:34)

35. అందరితో ఆప్యాయంగా మెలగండి. (ఖుర్ఆన్4:36)

36. పిసినారితనం చూపకండి. (ఖుర్ఆన్4:37)

37. ఇతరులపై అసూయ చెందకండి. (ఖుర్ఆన్4: 54)

38. ప్రజల మధ్య తీర్పులు చేసేటప్పుడు న్యాయంగా తీర్పు చేయండి. (ఖుర్ఆన్4:58)

39. ఒకరు ఇంకొకరిని చంపటం ఎంతమాత్రం తగదు. (ఖుర్ఆన్4:92)

40. ద్రోహానికి పాల్పడేవారి తరపున వాదిగా ఉండకూడదు. (ఖుర్ఆన్4:105)

41. న్యాయం విషయంలో గట్టిగా నిలబడండి. (ఖుర్ఆన్4:135)

42. మంచి పనుల్లో ఒండొకరికి తోడ్పడండి. (ఖుర్ఆన్ 5:2)

43. పాపకార్యాలలో, దౌర్జన్యపు పనుల్లో ఎవరితోనూసహకరించకండి. (ఖుర్ఆన్5:2)

44. మృత పశువు, రక్తం, పంది మాంసం, అల్లాహ్ పేరు గాక ఇతరుల పేరు ఉచ్చరించబడినది మీ కొరకు నిషేధించబడ్డాయి. (ఖుర్ఆన్5:3)

45. న్యాయంగా వ్యవహరించండి. (ఖుర్ఆన్5:8)

46. తప్పు చేసినవారిని ఉచితంగా శిక్షించాలి. (ఖుర్ఆన్5:38)

47. పాపిష్టి, అధర్మమైన కార్యాలకు విరుద్ధంగా పోరాడాలి. (ఖుర్ఆన్5:63)

48. సారాయి, మత్తుపదార్థాల జోలికి వెళ్ళకండి. (ఖుర్ఆన్5:90)

49. జూదం కూడా నిషేధించబడింది. (ఖుర్ఆన్5:90)

50. ఇతరులు ఆరాధించే వాటిని దూషించకండి. (ఖుర్ఆన్6:108)

51. ఎక్కువ మంది చెప్పిందే సత్యానికి ప్రతీక కాదు. (ఖుర్ఆన్6:116)
52. కొలతలు తూనికలలో  పూర్తిగా, న్యాయంగా వ్యవహరించండి.(ఖుర్ఆన్6:152)
53. అహంకారం చూపకండి. (ఖుర్ఆన్7:13)
54. తినండి, త్రాగండి. కాని మితిమీరకండి. (ఖుర్ఆన్7:31)
55. మీరు మస్జిదుకు హాజరైన ప్రతిసారీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ వహించండి. (ఖుర్ఆన్7:31)
56. ఇతరుల తప్పులపై మన్నింపుల వైఖరి అవలంబించు. (ఖుర్ఆన్7:199)
57. యుద్ధభూమిలో వెన్నుచూపకండి. (ఖుర్ఆన్8:15)
58. ఒకవేళ ఏవ్యక్తి అయినా నీశరణు కోరితే, అతనికి నువ్వు ఆశ్రయమివ్వు. (ఖుర్ఆన్9:6)
59. పరిశుద్ధతను పాటించండి. (ఖుర్ఆన్9:108)
60. అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. (ఖుర్ఆన్12:87)
61. మరి ఎవరయినా అజ్ఞానం వల్ల దురాగతాలకు పాల్పడి, ఆపైన పశ్చాత్తాపం చెందితే, దిద్దుబాటు కూడా  చేసుకుంటే అప్పుడు నిశ్చయంగా నీ ప్రభువు అపారంగా క్షమించేవాడు, అమితంగా కనికరించేవాడు.(ఖుర్ఆన్16:119)
62. అల్లాహ్ మార్గం వైపు జనులను వివేకంతోనూ, చక్కని ఉపదేశంతోనూ పిలువు. అత్యుత్తమ రీతిలో వారితో సంభాషణ జరుపు. (ఖుర్ఆన్ 16:125)
63. పెడదారి పట్టేవాడు తనకీడుకుతానే కారకుడౌతాడు. (ఖుర్ఆన్17:15)
64. తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా వ్యవహరించాలి.(ఖుర్ఆన్17:23)
65. తల్లిదండ్రులయెడల అసభ్యంగా ప్రవర్తించకూడదు. (ఖుర్ఆన్17:23)
66. ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెట్టకూడదు. (ఖుర్ఆన్17:29)
67. దారిద్ర్య భయంతో మీరు మీ సంతానాన్ని చంపేయకండి.(ఖుర్ఆన్17:31)
68. వ్యభిచారం దరిదాపులకు కూడా పోకూడదు. (ఖుర్ఆన్17:32)
69. నీవు తెలుసుకోవలసిన అవసరం లేని విషయాల వెంటపడకు. (ఖుర్ఆన్17:36)
70. ప్రజలతో మృదువుగా మాట్లాడండి. (ఖుర్ఆన్20:44)
71. పనికిమాలిన వాటిని పట్టించుకోకూడదు. (ఖుర్ఆన్23:3)
72. ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా ప్రవేశించకండి. (ఖుర్ఆన్24:27)
73. ఎవరైతే కేవలం అల్లాహ్ పై విశ్వాసం ఉంచుతారో అల్లాహ్ వారికి రక్షణ కలిపిస్తాడు. (ఖుర్ఆన్24:55)
74. తల్లిదండ్రుల అనుమతి లేనిదే వారి గదిలోనికి ప్రవేశించరాదు. (ఖుర్ఆన్24:58)
75. నేలపై వినమ్రులై నడవండి. (ఖుర్ఆన్25:63)
76. నీప్రాపంచిక భాగాన్ని కూడా మరువబోకు. (ఖుర్ఆన్28:77)
77. అల్లాహ్‌తో పాటు మరే  దేవుణీ మొరపెట్టుకోకు. (ఖుర్ఆన్28:88)
78. స్వలింగ సంపర్కానికి పాల్పడకండి. (ఖుర్ఆన్29:29)

79. సత్కార్యాల గురించి ఆజ్ఞాపించు, చెడు పనుల నుండి వారిస్తూ ఉండు. (ఖుర్ఆన్31:17)

80. భూమిపై నిక్కుతూ నడవకు. (ఖుర్ఆన్31:18)

81. కంఠ స్వరాన్ని తగ్గించి మాట్లాడండి. (ఖుర్ఆన్31:19)

82. స్త్రీలు సింగారాన్ని చూపిస్తూ తిరగరాదు. (ఖుర్ఆన్33:33)

83. నిశ్చయంగా అల్లాహ్ పాపాలన్నింటినీ క్షమిస్తాడు. (ఖుర్ఆన్39:53)

84. అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి.(ఖుర్ఆన్39:53)

85. చెడును మంచి ద్వారా తొలగించండి. (ఖుర్ఆన్41:34)

86. ప్రతి పని పరస్పర సలహా సంప్రతింపుల ద్వారా జరగాలి. (ఖుర్ఆన్42:38)

87. రెండు పక్షాల వారు పరస్పరం గొడవ పడితే వారి మధ్య సయోధ్య చేయండి. (ఖుర్ఆన్49:9)

88. ఇతరులను ఎగతాళి చేయరాదు. (ఖుర్ఆన్49:11)

89. అతిగా అనుమానించకండి. (ఖుర్ఆన్49:12)

90. కూపీలులాగకండి.చాడీలు చెప్పకండి. (ఖుర్ఆన్49:12)

91.యదార్థానికి మీలో అందరికన్నా ఎక్కువగా భయభక్తులు గలవాడే అల్లాహ్ సమక్షంలో ఎక్కువగా ఆదరణీయుడు. (ఖుర్ఆన్49:13)

92. అతిథులను గౌరవించండి. (ఖుర్ఆన్51:26)

93. మీ సంపదలో నుంచి దానధర్మాలు చేయండి. (ఖుర్ఆన్57:7)

94. సన్యాసత్వానికి ఇస్లాంలో చోటులేదు. (ఖుర్ఆన్57:27)

95. జ్ఞానం ప్రసాదించబడినవారి అంతస్థులను అల్లాహ్ పెంచుతాడు. (ఖుర్ఆన్58:11)

96. ముస్లిమేతరులతో సద్వ్యవహారం చేయండి, న్యాయంగా వ్యవహరించండి. (ఖుర్ఆన్60:8)

97. ఆత్మలోభత్వం నుండి కాపాడుకోండి. (ఖుర్ఆన్64:16)

98. క్షమాపణకై అల్లాహ్‌ను అర్థిస్తూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ గొప్ప క్షమాశీలి, దయాశీలి.(ఖుర్ఆన్73:20)

99. యాచించే వానిని కసిరికొట్టకు. (ఖుర్ఆన్93:10)

100. నిరుపేదకు అన్నం పెట్టమని ప్రేరేపించండి. (ఖుర్ఆన్107:3)

***మేము మానవునికి తన తల్లి దండ్రుల పట్ల మంచితనంతో మెలగాలని ఆదేశించాము. అతని తల్లి అతనిని ఎంతో బాధతో తనగర్భంలో భరించింది మరియు ఎంతో బాధతో అతనిని కన్నది. మరియు అతనిని గర్భంలో భరించి, అతనిని పాలు విడిపించే వరకు ముప్పై నెలలు అవుతాయి. చివరకు అతడు పెరిగి పెద్దవాడవుతాడు మరియు అతడు నలభై సంవత్సరాల వయస్సుకు చేరి ఇలా అంటాడు:***

***"ఓ నా ప్రభూ! నీవు, నాకూ మరియు నా తల్లిదండ్రులకూ ప్రసాదించిన అనుగ్రహాలకు నేను నీకు కృతజ్ఞతలు తెలుపుకోవటానికి మరియు నీవు ఇష్టపడే సత్కార్యాలు చేయటానికి నాకు సద్బుద్ధిని ప్రసాదించు మరియు నా సంతానాన్ని కూడా సద్వర్తనులుగా చేయి. నిశ్చయంగా, నేను పశ్చాత్తాపంతో నీ వైపునకు మరలుతున్నాను. మరియు నిశ్చయంగా, నేను నీకు విధేయులైన (ముస్లింలైన) వారిలో ఒకడిని." (46:15)***

# పరమ ప్రభువు అల్లాహ్ ఒక్కడే !

ఈ విశ్వ మానవ సృష్టికి కర్త, యజమాని, స్వామి కాబట్టి ఆయనే సర్వాధికారి. మానవునికి ధర్మాన్ని, శాసనాలను, విశ్వాసాలను, ఆచరణానియమాలను ప్రతిపాదించడం ఆయనకే చెల్లుతుంది. సత్యాసత్యాలు, ధర్మాధర్మాలేవో తెలపడం ఆయనభాధ్యతే. మరే శక్తికయినా సరే మానవునికి చట్టాన్నిచ్చే యోగ్యతాలేదు. ఏ మానవుడు మరేశక్తీ ఈ సర్వాధికార సత్తా కలిగిలేరు.

పరమప్రభువు మానవులకు ఒకే ధర్మాన్ని ప్రసాధించాడు. అదే దైవవిధేయత (ఇస్లామ్). ఈ ఒక్క ధర్మమే మానవులకు, సర్వకాలాల్లోనూ ప్రవక్తల ద్వారా అందజేయబడుతూ వచ్చింది. ఏ ప్రవక్తా తనదంటూ ఒక ప్రత్యేక ధర్మాన్ని స్థాపించుకోలేదు. దేవుని ఈ ధర్మాన్నే ప్రవక్తలందరూ ఆది నుండీ మానవాళికి అందజేస్తూ, ఆచరిస్తూ, ప్రచారంచేస్తూ వచ్చారు. ప్రవక్తల తరువాత వారి అనుచరులూ తమ సమకాలీన మానవులకు అందజేస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే అనుచరులలోని కొందరు స్వార్ధపరులు తమ స్వప్రయోజనాలు, సొంత ఇష్టాఇష్టాలు, స్వీయోత్కర్షల కారణంగా దైవధర్మాన్ని విభేధాలకు గురిచేశారు. ఎన్నోవ్యత్యాసాలను కల్పించారు.

ఈ విభేధాలు వ్యత్యాసాల ఆధారంగా అనేక మతాలు, విభిన్న వర్గాలు ఏర్పరుచుకున్నారు. ప్రజలలో ఏర్పడిన ఈ మతాలు, వర్గాలు అన్నీ “ఆ ఒక్క ధర్మం” యొక్క వికృతరూపాలే. వాటినే ప్రాక్షాళించి, పునరుజ్జీవింపజేసి తిరిగి “ఆ ఒక్కధర్మాన్నే” స్థాపించుటకు మహనీయ ముహమ్మద్(స) ఆవిర్భవించారు.

ఈ విధంగా ప్రకటించు :

సత్యం వచ్చేసింది మరియు అసత్యం అంతరించింది. ఖచ్చితంగా అసత్యం నశించక తప్పదు ఖుర్ఆన్ 17:81.

అపశకునం షిర్క్ - దానిని పాటించరాదు? ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపద్దేశించినట్లు ఇమ్రాన్ బిన్ హుసైన్ రదియల్లాహు అన్హు ఉల్లేఖనంలో ఉంది: “అపశకునం పాటించేవాడు, ఇతరులతో తెలుసుకొని అపశకునము నమ్మేవాడు, “కహానత్”(జోతిష్యము) చేసేవాడు, చేయించేవాడు, చేతబడి చేసేవాడు, చేయించేవాడు మాలోనివాడు కారు”. తబ్రాని ఫిల్ కబీర్:18/162.సహీహుల్ జామి: 5435). శకునం నష్టాలు: శని, శకున, అరిష్ట భావాలు కలిగి ఉండటం వల్ల కలిగే నష్టాలు:

1) శకునం విశ్వాసానికి విరుద్ధ పదం, సత్య నమ్మకానికి వ్యతిరేకం.

2) శకునం వల్ల కీడు సోకడంగానీ, మేలు కలగడం గానీ జరుగదు.

3) శకునం బుద్ధి మాంద్యానికి, పిరికి తనానికి. వివేక శూన్యానికి నిదర్శనం.

4) శకునం ఆందోళనకు, చపల చిత్తానికి ఆనవాలు.

5) శకునం కార్య శూన్యతకు ప్రేరకం.

6) శకునం మంచి పనులు కూడా చేయకుండా అడ్డుకుంటుంది. మనిషి ప్రయత్నాన్ని మాన్పించి, పని దొంగగా మారుస్తుంది.

7) శకునం అజ్ఞాన కాలపు అవలక్షణం, మూర్ఖపు చేష్ట తప్ప మరేమీ కాదు.

8) శకునాన్ని నమ్మడం అంటే విధి వ్రాతను తిరస్కరించడమే విశ్వాస మూల స్తంభాల నుండి ఒక మూల స్తంభాన్ని విస్మరించి అల్లాహ్ ను తిరస్కరించిన వారుగా పరిగణలోకి వస్తుంది.

9) శకునం అవిశ్వాసుల గుణం.

10) శకునం అనేది అల్లాహ్ ఆదేశానికి మరియు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి సున్నత్‌కు వ్యతిరేకం.

హ(జత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఈ విధంగా తెలియజేశారు: "ఎవరైతే నలభై రోజుల పాటు క్రమం తప్పకుండా ప్రతి నమాజ్ మొదటి తక్బీర్ నుండి జమాత్‌తో పాల్గొని సామూహికంగా చేస్తాడో అతని కోసం రెండు విముక్తులు ఉన్నాయి. ఒకటి, నరకాగ్ని నుండి విముక్తి, రెండు, కాపట్యం నుండి విముక్తి.లి" (అబూదావూద్, జామె తిర్మిజి)

(112:1) (ఓ ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం!) వారికి ఇలా చెప్పు: అల్లాహ్ (నిజమైన ఆరాధ్యుడు)ఒక్కడు.

(112:2) అల్లాహ్ నిరపేక్షాపరుడు.(ఏ అక్కరా లేనివాడు).

(112:3) ఆయన (ఎవరినీ) కనలేదు. ఆయన (కూడా) ఎవరికీ పుట్టినవాడు కాడు.

(112:4) ఆయనకు సరిసమానుడు (పోల్చదగిన వాడు) ఎవడూ లేడు.??

ఇస్లాంలో రెండే పండగలున్నాయి రంజాన్, ఖుర్బానీ పండుగ, ఇవి కాకుండా ఎవరైతే తనకు నచ్చిన విధంగా ఏది పడితే అది పండగా ఆనుకొని ఖుర్'ఆన్ మరియు ప్రామాణికమైన హదీస్ ల కు వెతిరేకంగా చేస్తాడో...

మహా ప్రవక్త ముహమ్మద్ (సలల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రబోధించారు "ఎవరైతే ఏ జాతి వేషధారణకు(విధానాన్ని) అవలంభిస్తారో వరు వారిలోని వకారుగా పరిగణించబడుతారు" (అబుదావుద్ హదీస్:2831)

హ(జత్ అబూ హురైర (రాజియాల్లాహు అన్హు) కథనం (మహా ప్రవక్త ముహమ్మద్ సలల్లాహు అలైహి వసల్లం) ఇలా హితోపాదేశం చేసారు'' గతించిన జాతులు చేసిన నీతిమాలిన పోకడలకు నా ఉమ్మత్ (సముదాయం) అలవాటుపడనంత వరకు ప్రళయం సంభవించదు''అది విన్న మేము(సహాబాల) యా రసులల్లాహ్! ఏమిటి మేము 'రోమ్' మరియు 'ఇరాన్' ప్రజలను అనుసరిస్తామ?' అని అన్నము. అందుకు "వారు తప్ప మరెవర్ని అనుకుంటున్నారు?' అని సమాధానమిచ్చారు. (భూఖారీ షరీఫ్ : 6774)

పరమ పవిత్రుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చారు.''అల్లాహ్‌ను పరలోకాన్ని విశ్వసించినవారు అల్లాహ్‌పై అయన ప్రవక్తపై తిరుగుబాటు చేస్తున్నవారిని ఎన్నటికీ ప్రేమించరు. చివరికి వారు తమ తండ్రులైన,కొడుకులైన, సోదరులైన లేదా తమ కుటుంభ సభ్యులైన సరే ససేమిరా ప్రేమించారు.అలా ప్రేమించడానికి నీవు ఎన్నటికీ చూడలేవు. 58:22

అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు సహవర్తులుగా ఎవరినీ కల్పించకండి. తల్లిదండ్రుల పట్ల ఉత్తమంగా వ్యవహరించండి. బంధువుల పట్ల, తండ్రిలేని బిడ్డల పట్ల, నిరుపేదల పట్ల, ఆత్మీయులైన పొరుగువారి పట్ల, బంధువులు కాని పొరుగువారి పట్ల, ప్రక్కనున్న మిత్రుల పట్ల, బాటసారుల పట్ల, మీ అధీనంలో ఉన్న బానిసల పట్ల ఔదార్యంతో మెలగండి. నిశ్చయంగా అల్లాహ్ అహంకారంతో విర్రవీగేవారిని, బడాయి కొట్టే వారిని ఎంతమాత్రం ఇష్టపడడు. 4:36

వక సారి వక పల్లెవాసి దైవ ప్రవక్త (సలల్లాహు అలైహి వసల్లం) వారి పవిత్ర సన్నిధికి వచ్చి 'ప్రళయం ఎప్పుడొస్తుంది?' అని అడిగాడు " దానికి కోసం నువ్వు ఎం ఏర్పాట్లు చేసుకున్నావు?" అనడిగారు ప్రవక్త (స). దనికావ్యక్తి అల్లాహ్'మరియు అయన ప్రవక్త గారిని ప్రేమించడం అన్నాడు. అతని సమాధానం విని "అయితే నీవు ఎవరిని ప్రేమిస్తున్నావో వారితోనే ఉ ంటావు" అని మహా ప్రవక్త (సలల్లాహు అలేహి వసల్లం) గారు అన్నారు (బుఖారీ,ముస్లిం)

(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు :''మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (తత్ఫలితంగా) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అపారంగా కనికరించేవాడు.'3 : 31

ఇంకా వారికి చెప్పు:''మీరు అల్లాహ్‌ను, ప్రవక్తకూ విధేయులై ఉండండి.'' ఒకవేళ వారు విముఖత చూపితే అల్లాహ్ తిరస్కారులను ఏ మాత్రం ఇష్టపడడు. 3 : 32

# అక్రమ సంపాదన

ఒకరి సొమ్మును ఇంకొకరు అన్యాయంగా స్వాహా చేయకండి. బుద్ధిపూర్వకంగా, అక్రమమైన రీతిలో ఇతరుల ఆస్తిలో కొంతభాగం కాజేయటం కోసం అధికారులకు ముడుపులు చెల్లించకండి. అది (న్యాయం కాదన్న సంగతి) మీకూ తెలిసినదే. ఖుర్ఆన్ సూరా అల్ బఖర 2:188

**<u>క్రయ విక్రయాలు:</u>** ఓ విశ్వసించిన వారలారా! ఒండొకరి సొమ్మును అధర్మంగా తినకండి. అయితే పరస్పర అంగీకారంతో జరిగే క్రయ విక్రయాల ద్వారా లభించే దానిని (తినవచ్చు). మిమ్మల్ని మీరు చంపుకోకండి. నిస్సందేహంగా అల్లాహ్ మీపై అమితమైన దయగలవాడు. ఖుర్ఆన్ సూరా అన్ నిసా 4:29

**<u>అక్రమమైన ఆస్తి:</u>** ఒకరి సొమ్మును ఇంకొకరు అన్యాయంగా స్వాహా చేయకండి. బుద్ధిపూర్వకంగా, అక్రమమైన రీతిలో ఇతరుల ఆస్తిలో కొంతభాగం కాజేయటం కోసం అధికారులకు ముడుపులు చెల్లించకండి. అది (న్యాయం కాదన్న సంగతి) మీకూ తెలిసినదే. ఖుర్ఆన్, సూరా అల్ బఖర 2:188

**<u>కొలతలు తూనికలు:</u>** (కొలతలు, తూనికల్లో) తగ్గించి ఇచ్చే వారు నాశనమవుదురు గాక! వారు ప్రజల నుండి కొలిచి తీసుకునేటప్పుడు మాత్రం పూర్తిగా-ఖచ్చితంగా-తీసుకుంటారు. కాని వారికి కొలచిగానీ, తూకం వేసిగానీ ఇచ్చేటప్పుడు మాత్రం తగ్గించి ఇస్తారు. ఏమిటి, తాము (మరణానంతరం) తిరిగి లేపబడతామన్న ఆలోచన వారికి బొత్తిగా లేదా? ఒక మహాదినాన. ఖుర్ఆన్, సూరా అల్ ముతఫ్ఫిఫీన్ 83:1-5

**<u>అపమార్గం:</u>** జ్ఞానంతో నిమిత్తం లేకుండానే ప్రజలను అల్లాహ్ మార్గం నుంచి తప్పించటానికి, దాన్ని వేళాకోళం చేయడానికి మనసును వశీకరించే విషయాలను కొనుగోలు చేసేవాడు కూడా మనుషుల్లో ఉన్నాడు. పరాభవం పాల్జేసే శిక్ష ఉన్నది ఇలాంటి వారికోసమే. ఖుర్ఆన్, సూరా లుక్మాన్ 31:6

వివాహం చేసుకునే ఆర్థిక స్థోమత లేనివారు, అల్లాహ్ తన అనుగ్రహంతో తమకు స్థోమతను ప్రసాదించేవరకూ శీలశుద్ధతను పాటించాలి. మీ బానిసలలో ఎవరయినా మీకేదైనా (సొమ్మును) ఇచ్చి, విడుదలకు సంబంధించిన లిఖిత పూర్వక ఒప్పందం (ముకాతబత్) మీతో చేసుకోదలిస్తే వారిలో మీకు మంచితనం కానవచ్చిన పక్షంలో-వారికి వ్రాతపత్రం వ్రాసి ఇవ్వండి. అల్లాహ్ మీకు ప్రసాదించిన ధనంలో నుంచి వారికి కొంత ఇవ్వండి. మీ బానిస స్త్రీలు శీలవతులుగా ఉండగోరినప్పుడు, మీరు మీ ప్రాపంచిక జీవితపు స్వలాభాల కోసం వాళ్ళను వేశ్యావృత్తికై బలవంతపెట్టకండి. ఒకవేళ ఎవరయినా వారిని (ఆ నీచమైన పని కోసం) బలవంతం చేస్తే, ఆ బలాత్కారం తరువాత అల్లాహ్ (ఆ అభాగినులను) క్షమించేవాడు, కనికరించేవాడు. ఖుర్ఆన్, సూరా అన్ నూర్ 24:33

**<u>దొంగతనం:</u>** దొంగతనం చేసినది పురుషుడైనా, స్త్రీ అయినా ఉభయుల చేతులూ నరకండి. అది వారు చేసిన దానికి ప్రతిఫలం. అల్లాహ్ తరపున విధించబడిన శిక్ష. అల్లాహ్ సర్వాధిక్యుడు, వివేచనాశీలి కూడా. ఖుర్ఆన్, సూరా అల్ మాయిద 5:38

షైతాన్ చేష్టలు: ఓ విశ్వసించిన వారలారా! సారాయి, జూదం, బలిపీఠాలు, జోస్యం కోసం వాడే బాణాలు ఇవన్నీ పరమ జుగుప్సాకరమైన విషయాలు, షైతాన్ చేష్టలు. కాబట్టి వాటికి దూరంగా ఉండండి. మీరలా చేస్తే సాఫల్యం పొందవచ్చు. ఖుర్ఆన్, సూరా అల్ మాయిద 5:90

వడ్డీ సొమ్ము తినేవారు షైతాను పట్టటంవల్ల ఉన్మాది అయినవాని లాగానే నిలబడతారు. వారికీ దుర్గతి పట్టడానికి కారణం "వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే కదా!" అని వారు అనటమే. వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం చేసి, వడ్డీని నిషేధించాడు. కనుక ఎవరు తన ప్రభువు వద్దనుంచి వచ్చిన హితబోధను విని వడ్డీని మానుకున్నాడో, అతడు గతంలో పుచ్చుకున్నదేదో పుచ్చుకున్నాడు. అతని వ్యవహారం దైవా ధీనం. ఇకమీదట కూడా దీనికి పాల్పడినవారే నరకవాసులు. వారు కలకాలం అందులో పడి ఉంటారు .ఖుర్ఆన్, సూరా అల్ బఖర 2:275

# ఖుర్ఆన్ ఉపదేశం సూరతున్నస్ర్

**ఆయతులు 3** **రుకూలు: 1** **అవతరణ: మదీనాలో**

***అమిత దయాళువు, అనంత కారుణ్యమూర్తి అయిన అల్లాహ్ పేరుతో***

**-ముఫ్తి ముహమ్మద్ ఫారూఖ్ అల్ ఖాశిమీ,**

**లబ్బీపేట, విజయవాడ**

తర్జుమా:

1. అల్లాహ్ సహాయం లభించినప్పుడు, విజయం ప్రాప్తమయినప్పుడు

2. తండోపతండాలుగా ప్రజలు అల్లాహ్ ధర్మంలోకి ప్రవేశించడాన్ని నీవు చూసినప్పుడు

3. నీవు నీ ప్రభువును స్తుతించు, ఆయన పవిత్రతను కొనియాడు. అలాగే ఆయన మన్నింపును ఆర్జించు. నిస్సందేహంగా ఆయన ఎంతగానో క్షమించేవాడు.

వ్యాఖ్యాన సారాంశం:

(ఓ ముహమ్మద్(స) అల్లాహ్ సహాయం మరియు (మక్కా) విజయం (తన నిదర్శనాలతో సహా) లభించినప్పుడు (ఆ విజయానికి సంబంధించిన నిదర్శనాలేమిటంటే) ఆ విజయం లభించినప్పుడు ప్రజలు తండోపతండాలుగా అల్లాహ్ ధర్మం (ఇస్లామ్)లో ప్రవేశించడాన్ని మీరు చూస్తారు. అప్పుడు (మీరు ఇహలోకంలో ఉండటానికి సంబంధించిన లక్ష్యం, దర్మపరిపూర్తికి సంబంధించిన మీ పుట్టుక పరమార్థం లక్ష్యం నెరవేరినట్లుగా మీకు గుర్తించడం. కనుక ఇక పరలోక ప్రయాణానికి సిద్ధం కండి. దాని కొరకు సన్నాహాలు చేయండి). మీరు మీ ప్రభువు పవిత్రతను కొనియాడుతూ ఆయనను స్తుతించండి. అలాగే ఆయనను మన్నించమని వేడుకోండి. (అనగా శ్రేష్టతకు విరుద్ధంగా జరిగిపోయిన కార్యాల విషయంలో మన్నింపును వేడుకోండి. నిస్సందేహంగా ఆయన (అల్లాహ్) పశ్చాత్తాపాన్ని ఎంతగానో స్వీకరించే వాడు. క్షమించేవాడు.

పరమార్థం - నియమాలు

ఈ సూరహ అందరి ఏకాభిప్రాయం ప్రకారం మదీనాలో అవతరించబడింది. ఈ సూరహ్ తౌదీఅగా కూడా పిలువబడుతుంది. తౌదీఅ అనగా ఎవరినయినా సాగనంపడం అని అర్థం. ఈ సూరహ్‌లో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఇహలోకం నుంచి నిష్క్రమించ డానికి సంబంధించిన సూచన ఉన్న కారణంగా ఈ సూరహ్‌ను సూరయె తౌదీఅ అని కూడా పిలుస్తారు. ఇది చివరగా అవతరించిన ఖుర్ఆన్ సూర:

సహీహ్ ముస్లిమ్ అనే హదీసు గ్రంథంలో హజ్రత్ ఇబ్నెఅబ్బాస్(రజి) ఉల్లేఖనం ప్రకారం 'నస్ర్' సూరహ్ ఖుర్ ఆన్‌కు చెందిన ఆఖరి సూరహ్. (ఖుర్తుబీ) అనగా ఈ సూరహ్ తర్వాత మరే ఇతర సంపూర్ణ సూరహ్ అవతరించ లేదు. కొన్ని హదీసు ఉల్లేఖనాల ప్రకారం కొన్ని ఖుర్ ఆన్ వాక్యాలు ఈ సూరహ్ తర్వాత అవతరించబడిన విషయానికొస్తే అది ఈ సూరహ్ ఖుర్ఆన్‌కు చెందిన ఆఖరి సూరహ్ అనే విషయానికి విరుద్ధమైనది కాదు. అల్ ఫాతిహ, సూరహ్‌ను మొట్టమొదట అవతరించిన ఖుర్ఆన్ సూరహ్ అని ఇదే అర్థంలో పేర్కొనడం జరుగుతుంది. అనగా అల్ ఫాతిహ సూరహ్ మొట్టమొదట అవతరించిన సంపూర్ణ సూరహ్ 'ఇఖ్రా', ముద్దస్సిర్ మొదలయిన సూరహ్‌లకు చెందిన కొన్ని ఖుర్ఆన్ వాక్యాలు అల్ ఫాతిహ సూరహ్ కంటే ముందు అవతరించబడిన సూరహ్ అనే విషయానికి విరుద్ధం కాదు. ఎందు కంటే సంపూర్ణంగా అవతరించిన మొట్టమొదటి సూరహ్ 'అల్ ఫాతిహ' సూరహ్‌యే!

హజ్రత్ ఇబ్నె ఉమర్(ర) ఈ విధంగా పేర్కొన్నారు. 'ఈ సూరహ్ హజ్జతుల్ విదా (వీడ్కోలు హజ్)లో అవతరించింది. ఆ తర్వాత 'అల్ యౌమ అక్‌మల్‌తు లకుమ్ దీనకుమ్..' అనే వాక్యం అవతరిం చింది. ఈ వాక్యాలు అవతరించిన తర్వాత దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ప్రపంచంలో కేవలం 80 రోజులు జీవించి ఉన్నారు. (80 రోజుల తర్వాత ఆయన (స) పరమపదించారు)

'నస్ర్' సూరహ్‌లో 'ఇజా జాఅ నస్‌రుల్లాహి వల్

ఫత్హ్' అనే వాక్యంలో 'ఫతహ్' (విజయం) అంటే మక్కా విజయమేననే విషయంలో అందరికీ ఏకాభిప్రాయం ఉంది. అయితే ఈ సూరహ్ మక్కా విజయం కంటే ముందే అవతరించిందా లేక తర్వాత అవతరించిందా అనే విషయంలో భేదాభిప్రాయాలున్నాయి. 'ఇజా జాఅ' (వచ్చినప్పుడు) అనే పదం ద్వారా మక్కా విజయం కంటే ముందే ఈ వాక్యం అవతరించినట్లుగా తెలుస్తోంది. 'రూహుల్ మఆనీ' అనే ఖుర్ఆన్ వ్యాఖ్యాన గ్రంథంలో 'బహ్రె ముహీత్' అనే హదీసు గ్రంథంలోని ఒక హదీసు ద్వారా ఈ విషయం ధృవీకరించబడింది. అందులో ఈ సూరహ్ ఖైబర్ యుద్ధం నుంచి దైవప్రవక్త ముహమ్మద్(స), ఆయన సహచరులు(ర) తిరిగి వస్తున్న సమయంలో అవతరించినట్లుగా పేర్కొనబడింది. ఖైబర్ యుద్ధ విజయం మక్కా విజయం కంటే ముందే ప్రాప్తమయిన విషయం అందరికీ తెలిసిన విషయమే. అలాగే 'రూహుల్మఆనీ' అనే ఖుర్ఆన్ వ్యాఖ్యాన గ్రంథంలో అబ్ద్ ఇబ్నె హుమైద్ ద్వారా హజ్రత్ ఖతాదహ్ (ర) ఒక హదీసును ఈ విధంగా ఉల్లేఖించారు. 'దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ సూరహ్ అవతరించిన తర్వాత రెండు సంవత్సరాల పాటు జీవించి ఉన్నారు.

ఏయే హదీసు ఉల్లేఖనాల్లో అయితే ఈ సూరహ్ మక్కా విజయం సందర్భంలో లేదా 'హజ్జతుల్ విదా' (వీడ్కోలు హజ్)సందర్భంలో అవతరించినట్లుగా పేర్కొనబడిందో దానికి బహుశా అర్థం ఇది అయి ఉంటుంది. బహుశా దైవ ప్రవక్త(స) ఈ సూరహ్ను పఠించి ఉంటారు. దానితో ప్రజలు ఈ సూరహ్ అప్పుడే అవతరించినట్లుగా భావించి ఉండవచ్చు. ఈ విషయానికి సంబంధించిన మరిన్ని వివరాలు 'యానుల్ ఖుర్ఆన్' అనే ఖుర్ ఆన్ వ్యాఖ్యాన గ్రంథంలో లభిస్తాయి.

పలు మర్ఫూఅ హదీసుల్లోనూ దైవప్రవక్త సహచరుల ఉల్లేఖనాల్లోనూ ఈ సూరహ్లో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) పరమపదించే సమయం ఆసన్నమవడానికి సంబంధించిన సూచన ఉన్నట్లుగా పేర్కొనబడింది. అనగా అల్లాహ్ దైవప్రవక్త(స)ను 'మీరు ఇహలోకంలో ఉండటానికి సంబంధించిన కార్యం నెరవేరింది. కనుక ఇప్పుడు అల్లాహ్ స్మరణలో మన్నింపును వేడుకోవడంలో నిమగ్నులుకండి' అని ఈ సూరహ్ ద్వారా సూచించినట్లుగా పేర్కొనబడింది. 'మఖాతిల్' అనే హదీసు గ్రంథంలో పేర్కొనబడిన ఒక ఉల్లేఖనం ప్రకారం ఈ సూరహ్ అవతరించినప్పుడు దైవప్రవక్త(స) ఈ వాక్యాన్ని తన సహచరుల ముందు పఠించారు. ఆ సమయంలో అక్కడ హజ్రత్ అబూబకర్(ర), హజ్రత్ ఉమర్(ర) హజ్రత్ స అద్ బిన్ అబీ వఖాస్(ర) మొదలయినవారు హాజరయి ఉన్నారు. అందరూ ఈ సూరహ్ను విని అందులో మక్కా విజయ సూచన ఉన్న కారణంగా సంతోషభరితులయ్యారు. కానీ హజ్రత్ అబ్బాస్(ర) మాత్రం రోదించసాగారు. దైవప్రవక్త(స) అందుకు కారణమేమిటని అడిగినప్పుడు హజ్రత్ అబ్బాస్(ర) ఇలా పలికారు. ఇందులో మీ మరణానికి సంబంధించిన సూచన ఇమిడి ఉంది' అని పేర్కొన్నారు. దైవప్రవక్త(స) ఆ విషయాన్ని ధృవీకరించారు.

ప్రజలు తండోపతండాలుగా

మక్కా విజయానికి ముందే ఎంతో మంది ప్రజలకు ఇస్లాంపై దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) సత్యసంధతపై దాదాపుగా విశ్వాసం కలిగింది. కానీ ఖురైషీయుల వ్యతిరేకత పట్ల లేదా మరేదయినా భయం కారణంగా వారు ఇస్లాంను స్వీకరించలేదు. అయితే మక్కా విజయం వారి భయాలన్నింటినీ తొలగించివేయడంతో వారు తండోపతండాలుగా ఇస్లాంను స్వీకరించ నారంభించారు. ఒకటి నుంచి పది మందితో కూడిన సమూహాన్ని 'నసర్' యమన్ దేశం నుంచి 700 నసర్లు ఇస్లాంను స్వీకరించారు. వారు దారిలో ఆజాన్ పలుకుతూ, ఖుర్ఆన్ పఠిస్తూ వచ్చారు. అదే విధంగా సామాన్య అరబ్బులు తండోపతండాలుగా ఇస్లాంను స్వీకరించారు.

నీ ప్రభువును స్తుతించు

'నస్ర్' సూరహ్ అవతరించిన తర్వాత దైవ ప్రవక్త(స) అన్ని వేళలా 'సుబ్హానల్లాహి వబిహమ్దిహీ అస్తగ్ఫిరుల్లాహి వ అతూబు ఇలైహ్' అనే దుఆను విరివిగా పఠించేవారని, తనకు ఆ విధంగా చేయవలసిందిగా ఆదేశమివ్వబడిందని, అందుకు ఆధారంగా 'నస్ర్' సూరహ్ను పఠించేవారని హజ్రత్ ఉమ్మె సల్మహ్(ర) పేర్కొన్నారు. 'ఈ సూరహ్ అవతరించిన తర్వాత దైవప్రవక్త(ప) తన ఆరాధనలను తీవ్రతరం కావించారు. చివరకు ఆయన(స) పవిత్ర పాదాలు వాచిపోయాయి' అని హజ్రత్ అబూహురైరహ్(ర) పేర్కొన్నారు. (ఖుర్తుబీ)

# హజ్‌యాత్ర-సందేహాలు-సమాధానాలు

**1) విజయవాడ నుంచి గాలిబ్ షహీద్**

ప్రశ్న: **ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్తున్నాం. లగేజ్ ఎంత వరకు తీసుకొని వెళ్ళవచ్చు. సూట్‌కేస్ కొంటే మంచిదా? లేక బ్యాగ్ కొనుక్కోవాలా? పూర్తి సమాచారం ఇవ్వగలరు.**

జవాబు: హజ్ యాత్రికుడు ఇష్టానుసారంగా లగేజ్ తీసుకుని వెళ్ళడానికి వీలులేదు. ఒక యాత్రికుడు కేవలం 3 బ్యాగ్‌లు (రెండు లగేజ్ బ్యాగ్‌లు + ఒకటి హ్యాండ్ లగేజ్) తీసుకొని వెళ్ళవచ్చు. కాబట్టి మెత్తటి మెటీరియల్‌తో తయారు చేసిన 22 కేజీల రెండు సూట్ కేసులుండాలి. సైజ్ 158 సెంటీ మీటర్ల డైమన్షన్ వుండాలి. దీనితో పాటు 10 కేజీల హ్యాండ్ బ్యాగ్ తీసుకొని వెళ్ళవచ్చు. లగేజ్ విషయంలో చాలా జాగ్రత్త వహించి రెండు సూట్ కేసులు, ఒక హ్యాండ్ బ్యాగ్‌తోనే హజ్ యాత్రకు బయలుదేరాలి. బ్యాగేజ్ 22 కేజీ + 22 కేజీతో పాటు హ్యాండ్ లగేజ్ 10 కేజీలకు పరిమితి. లగేజ్‌లో నిషేధించిన వస్తువులు పెట్టుకోవద్దు. అలాంటి వస్తువుల విషయంలో సౌదీ ఇమిగ్రేషన్ అధికారులు కఠినంగా చర్యలు తీసుకుంటున్నారు.

**హ్యాండ్ లగేజ్:** హ్యాండ్ లగేజ్‌లో ఒక జత ఇహ్రామ్, మీరు రోజూ తొడిగే రెండు జతల బట్టలు, కళ్ళజోడు వాడుతుంటే తప్పని సరిగా రెండు జతలు పెట్టుకోవాలి, చెప్పులు, మీకు కావాల్సిన మందులు, బిస్కెట్‌లు, డ్రైఫ్రూట్స్, పాస్‌పోర్ట్, వీసా జిరాక్స్ కాపీ తదితర డాక్యుమెంట్లు పెట్టుకోండి. బ్లేడ్, కత్తెర, నెయిల్‌కట్టర్ లాంటి వస్తువుల్ని హ్యాండ్ లగేజ్‌లో తీసుకొని వెళ్ళరాదు.

**నిషేధించిన వస్తువులు:** సౌదీ ప్రభుత్వం నిషేధించిన వస్తువులు తీసుకొని వెళ్ళరాదు. సెంట్రల్ హజ్ కమిటీ ప్రచురించి, మీకు పంపించిన గైడ్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు స్పష్టంగా వున్నాయి. హజ్ యాత్రికుడు తీసుకొని వెళ్ళే మూడు బ్యాగ్‌లపైన కూడా కవర్ నెంబర్, పాస్‌పోర్ట్ నెంబర్, ఫోన్ నెంబర్, అడ్రస్ తప్పనిసరిగా రాయాలి.

**2) ఉమేరా అజీజ్ కర్నూల్ నుంచి**

ప్రశ్న: **నేను ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నాను. 2017లో ఉమ్రా చేశాను. ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్తున్నాం. 2 వేల రియాల్ అదనంగా చెల్లించాలంటున్నారు. గతంలో అలా వుండేది కాదు. ఎందుకు అదనంగా చెల్లించాలి?**

జవాబు: గడిచిన మూడు సంవత్సరాల్లో హజ్ యాత్రకానీ, ఉమ్రా కానీ చేసి వుంటే అదనంగా 2 వేల రియాల్ వీసా ఫీజు చెల్లించాలని సౌదీ ప్రభుత్వం నిర్ణయించింది. కాబట్టి 2 వేల రియాల్ వీసా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

**3) బాజీబాబా గుంటూరు నుంచి**

ప్రశ్న: **హజ్ సబ్సిడీ ఎత్తి వేశారు కాబట్టి ఈ ఏడాది హజ్ యాత్రికుడికి ఇవ్వాల్సిన 2 వేల 100 రియాల్ ఇస్తారా? లేదా?**

జవాబు: హజ్ సబ్సిడీకి, హజ్ యాత్రికుడు మక్కా వెళ్ళేటప్పుడు ఇచ్చే 2 వేల 100 సౌదీ రియాల్‌కు సంబంధం లేదు.

సబ్సిడీ అనేది కేవలం విమాన టిక్కెట్‌పైనే వుంటుంది. హజ్‌కు వెళ్ళే రోజు ప్రతి యాత్రికుడికి 2 వేల 100 సౌదీ రియాల్ ఇస్తారు. ఆ డబ్బు హజ్ యాత్రికుడు సెంట్రల్ హజ్ కమిటీకి చెల్లించిన దాంట్లో నుంచే తిరిగి ఇస్తారు. ఆ డబ్బుతో మక్కా, మదీనాలో భోజనం చేయడానికి ఉపయోగించుకునే ఉద్దేశంతో ఇస్తారు.

**4) ఎం.డి.షాజహాన్ అనంతపురం నుంచి**

**ప్రశ్న: ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్తున్నాం. అయితే ఇహ్రాం ఎలా వుండాలి? ఇహ్రాం కోసం తెల్లటి వస్త్రమే వుండాలా? ఎక్కడ కొనుగోలు చేయాలి? ఎవరైనా ఫ్రీగా ఇస్తే ఇహ్రాం తీసుకోవచ్చా?**

జవాబు: ఇహ్రాం మార్కెట్‌లో దొరుకుతుంది. క్వాలిటీని బట్టి రేటు వుంటుంది. అయితే ఫ్రీగా ఇహ్రాం తీసుకోవచ్చా? లేదా మరిన్ని విషయాలను ముస్లిం మతపెద్దలు, ధార్మిక పెద్దలను(ఆలిం,ముఫ్తి) అడిగి తెలుసుకోండి. ఏమీ తెలుసుకోకుండా హజ్‌యాత్రకు వెళ్ళవద్దు. ఏదైనా సమస్యపై ముఫ్తి, ఆలింలను అడిగి తెలుసుకోవడం ఉత్తమం. హజ్ యాతక్రు వెళ్ళే ముందు తెలుసుకోవాల్సిన నియమ నిబంధనలు. ప్రయాణంలో ఎలా వ్యవహరించాలో తెలుసుకోవడం తప్పనిసరి. పురుషుల కోసం ఉపయోగించే ఇహ్రాం బొడ్డుపై నుంచి మోకాలి కింది వరకు కట్టుకునే విధంగా లుంగీ వుండాలి. ఎందుకంటే కింది భాగం (సతర్) కనబడకుండా వుండాలి. కుడి భుజం నుంచి ఎడమ భుజంపై వేసుకునే విధంగా చాదర్ సైజ్ వుండాలి. పురుషుల కోసం తెల్లటి రంగు గల ఇహ్రాం ఉపయోగించడం మంచిది. ఇహ్రాం పైనకప్పుకునే దుప్పటి భుజం పై నుంచి జారి పడుతూ వుంటుంది. పిన్, సేఫ్టీ పిన్ పెట్టుకోవడం సరికాదు. ఎందు కంటే కుట్టిన వస్త్రం తొడగడానికి అనుమతి లేదు.

**5) షేక్ నసీరా బేగం కావలి నుంచి**

**ప్రశ్న: మహిళలు చేతి, కాలి వేళ్ల గోర్లకు రంగు వేయడం, పెదాలకు లిప్ స్టిక్ వేసుకోవడానికి అనుమతి వుందా? పేయింట్ శరీరానికి తగిలి వుంటే వజూ, గుసుల్ అవుతుందా?**

జవాబు: నేయిల్ పాలిష్ (స్త్రీలు తమ గోర్లకు పెట్టు కుంటారు) రాసుకోవడంవల్ల వజూ చేసిన నీరు గోర్లకు చేరుకోదు. కాబట్టి వజూ చేసేటప్పుడు రంగును తీసివేయడం తప్పనిసరి. లేకపోతే శుభ్రత, పవిత్ర వుండదు. ఇలాగే పెదాలపై పూసుకునే లిప్‌స్టిక్ కూడా మందంగా వుంటే వజూ చేసేటప్పుడు దాన్ని కూడా తీసివేయాలి. తీయకపోతే వజూ, గుసుల్ సరిగ్గా పూర్తి కాదు. (కితాబుల్ మసాయిల్ 145/1) శరీరంపై నీళ్ళు తగలడానికి పేయింట్ అడ్డుగా వుంటుంది. కాబట్టి వజూ, గుసుల్ అవ్వదు. (కితాబుల్ మసాయిల్ 145/1)

**6) సయ్యద్ ఫారూఖ్, ఒంగోలు నుంచి**

**ప్రశ్న: ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్తున్నాను. అయితే నాకు పూర్తి బట్టతల వుంది. తలపైన అసలు వెంట్రుకలే లేవు. హజ్‌కు వెళ్ళిన వ్యక్తి తలపైనే వెంట్రుకులు లేక పోతే ఏం చేయాలి?**

జవాబు: హజ్ విధుల్లో తలవెంట్రుకలు తీయడం కూడా కీలకమైన విధి. అయితే హాజీ తలపైనే వెంట్రుకలు లేకపోతే అలాంటి సమయంలో ఆ హాజీ షైతాన్‌పై రాళ్ళు విసిరిన తరువాత, ఖుర్బానీ విధి నిర్వర్తించిన తరువాత తల పైన బ్లేడ్‌తో క్లీన్ చేసుకోవడం తప్పనిసరి. ఆ తరువాత స్నానం చేసి ఇహ్రాం తీసివేసి సాధారణ దుస్తులు ధరించి కాబా తవాఫ్‌కు వెళ్ళాల్సి వుంటుంది.

# మైనారిటీల విద్యాభివృద్ధి కేంద్రం (సిఇడిఎం)

ఆంధ్రప్రదేశ్‌లో మైనారిటీలు అంటే, ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బుద్దిస్టులు, పార్సీలు జనాభా మొత్తం జనాభాలో 11 శాతంగా ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం 1994లో నిజాం కళాశాలలో మైనారిటీల విద్యాభివృద్ధి కేంద్రాన్ని (సిఇడిఎం) ఏర్పాటు చేసింది. సిఇడింకు కర్నూలు, గుంటూరు మరియు విశాఖపట్టణాలలో 3 ప్రాంతీయ కేంద్రాలు ఉన్నాయి.

మైనారిటీల విద్యాభివృద్ధి కేంద్రం దిగువ మూడు ప్రధాన ప్రాజెక్టులను అమలుచేస్తున్నది. వీటిని రాష్ట్ర ప్రభుత్వం స్పాన్సరు చేసింది.

వర్క్ బుక్స్ మరియు క్వశ్చన్ బ్యాంకులు వంటి ఉచిత మెటీరియల్ తో 10వ తరగతి ఉర్దూ/తెలుగు మీడియం మైనారిటీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వడం ద్వారా మైనారిటీలకు చెందిన పాఠశాల పిల్లల తరగతి ప్రతిభను మెరుగుపరచడంపై ఏకీకృత ప్రాజెక్టు.

మైనారిటీ విద్యార్థులు పాల్గొనడాన్ని ప్రతిభను మెరుగుపరచడంపై సమగ్రప్రాజెక్టు. ఆంధ్రప్రదేశ్ లో మైనారిటీలు ఎక్కువగా ఉండే జిల్లాలలో పాలిసెట్, ఎంసెట్, డీసెట్, ఐసెట్, ఎడ్ సెట్ వంటి ప్రవేశం కోరే కోర్సులకు ఉచిత కోచింగ్ మరియు స్టడీ మెటీరియల్.

ఉద్యోగం కోరే పోటీ పరీక్షలు అంటే, యు.పి.ఎస్.సి సివిల్ సర్వీసులు (ప్రిలిమ్స్), ఎ.పి.పి.ఎస్.సి గ్రూపు-1, 2 మరియు 4 పరీక్షలు, నెట్, డిఎస్సీ, ఏపిటెట్, విఆర్ఓ/విఆర్ఏ, పోలీసు నియామకం, బ్యాంకింగ్ సర్వీసులు వంటి వాటి కోసం మైనారిటీలకు ఉచిత కోచింగ్ స్టడీ మెటీరియల్ ను సమకూర్చడం.

గత నాలుగు సంవత్సరాల నిధుల విడుదల ఈ క్రింది విధంగా ఉంది:-

| వరుస సంఖ్య | సంవత్సరం | విడుదల చేసిన బడ్జెట్ | వ్యయం |
|---|---|---|---|
| 1. | 2014-15 | 50.00 లక్షలు | 50.00 లక్షలు |
| 2. | 2015-16 | 600.00 లక్షలు | 415.00 లక్షలు |
| 3. | 2016-17 | 1000.00 లక్షలు | 726.00 లక్షలు |
| 4. | 2017-18 | 250.00 లక్షలు | 237.00 లక్షలు |

# ఎన్.టి.ఆర్. విద్యోన్నతి

ప్రతి ఏడాది 300 మంది విద్యార్థులకు ప్రయోజనాన్ని అందించడానికి ప్రముఖ ప్రైవేటు సంస్థలకు ప్రతిభావంతులైన విద్యార్థులను స్పాన్సరు చేయడం కోసం సివిల్ సర్వీసు పరీక్షలలో వృత్తి సంబంధ మార్గదర్శనం ఇవ్వడానికి మైనారిటీల కోసం "ఎన్.టి.ఆర్. విద్యోన్నతి" అనే నూతన పథకాన్ని ఈ సంవత్సరం ప్రవేశ పెట్టడమయింది. ప్రవేశ పరీక్షకు 2050 మంది విద్యార్థులు హాజరయ్యారు. 300 మందిని ఎంపిక చేయడమయింది. ఢిల్లీ శ్రీరామ్, బెంగుళూరు యూనివర్సల్ ఐఎఎస్ స్టడీ సర్కిల్, హైదరాబాద్‌లోని ఆర్‌సి రెడ్డి, బ్రెయిన్ ట్రీ, డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్నారు.

# అర్హతగల మైనార్టీ అభ్యర్థులకు సివిల్ సర్వీస్ పరీక్షలకు ఉచిత శిక్షణా కార్యక్రమం

## మైనారిటీల విద్యాభివృద్ధి కేంద్రం (సిఇడిఎం) ద్వారా ఉచిత శిక్షణా కార్యక్రమాలు

1) యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ ఎగ్జామ్స్
2) బ్యాంక్ ప్రొబిషనరీ ఆఫీసర్స్, ఇన్సూరెన్స్ ఆఫీసర్స్ పోటీ పరీక్షలకు, రీజనల్ రూరల్ బ్యాంక్ పరీక్షలు, బ్యాంక్ క్లర్క్, స్టాఫ్ సెలక్షన్ పోటీ పరీక్షలకు
3) గ్రూప్ 1
4) గ్రూప్ 2
5) గ్రూప్ 3
6) ఇతర ప్రభుత్వ పోటీ పరీక్షలకు

## దరఖాస్తు చేసుకునే వారి అర్హతలు

1) అభ్యర్థి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారై మైనార్టీ అభ్యర్థి అయి వుండాలి.
2) విద్యార్హతలు, వయస్సు ఆయా పరీక్షలకు సంబంధించి వెలువడే నోటిఫికేషన్ ప్రకారం వుండాలి.
3) వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంత వాసులకైతే 1,50,000/-, పట్టణ ప్రాంతవాసులకైతే 2,00,000/-
4) దరఖాస్తు చేసుకునే అభ్యర్థి ఇటు వంటి ఇతర ప్రభుత్వ స్కీంల నుంచి లబ్ది పొంది వుండరాదు

## జత చేయవల్సిన సర్టిఫికెట్లు

1) అర్హత గల అభ్యర్థి నిర్ణీత నమూనాలో వున్న దరఖాస్తును డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.ఎపిఎస్ఎంఎఫ్‌సి.కామ్ వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్‌లో భర్తీ చేయాలి.
2) దరఖాస్తుతో పాటు జతచేసే స్కాన్ కాపీలు 50కెబి నుంచి 150 కెబి సైజ్ వుండాలి. జిరాక్స్ కాపీలపై అభ్యర్థి సంతకం చేయాలి.
3) ఎస్ఎస్‌సి సర్టిఫికెట్
4) ఆధార్‌కార్డు
5) తెల్లరేషన్ కార్డు వుంటే ఫొటోస్టాట్ కాపీ జత చేయాలి
6) ఇన్‌కం సర్టిఫికెట్ (వైట్ రేషన్ కార్డు వుంటే అవసరం లేదు)
7) ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, మార్కుల మెమోలు, విద్యార్హతల సర్టిఫికెట్లు
8) దరఖాస్తు దారుడి పాస్‌పోర్ట్ సైజ్ పొటో (జెపెగ్ ఫార్మెట్ 50 కెబి సైజ్)